

100వ కి.మీ

3ఫిబ్రవరి 2023

బంగారుపాళ్యం శివార్లలో తొలి వందవ కిలోమీటరు మైలు రాయి.

హామీ: ప్రభుత్వం ఏర్పాటైన మొదటి వంద రోజుల్లోపు బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి డయాలసిస్ పరికరాలు అందజేస్తాం.

కూటమి ప్రభుత్వ విజయంలో ఒక కీలక మైలురాయి యువగళం పాదయాత్ర. తొలి అడుగు పడింది ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే. కుప్పంలో 2023 జనవరి 27న మొదలైన నడక దాదాపు ఏడాది పాటు సాగింది. జగన్‌రెడ్డి ప్రభుత్వం అడుగడుగునా సృష్టించిన అవాంతరాలను అధిగమిస్తూ, వైసీపీ శ్రేణుల బెదిరింపులను ఎదుర్కొంటూ యువగళం సాగింది. ఈ సందర్భంగా ప్రతి వంద కిలోమీటర్లకూ ఒక మైలు రాయిని లోకేష్ ఆవిష్కరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల లోగా అమలు చేస్తామంటూ కొన్ని హామీలు ఇచ్చారు. ఇలా ఉమ్మడి జిల్లాలో ఆరు మైలు రాళ్ల ప్రతిష్ఠాపన జరిగింది. వీటిలో తొలి హామీ బంగారుపాళ్యంలో కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్ కేంద్రం నెలకొల్పుతామన్నది. చెప్పినట్టే వంద రోజుల్లోగా ఆ పని చకచకా జరిగిపోతోంది. ఖాళీ ఖజానాతో ప్రభుత్వ పాలన మొదలైనా మాటతప్పరనే నమ్మకాన్ని ఇది కలిగిస్తోంది. దీంతో పాటూ మిగిలిన హామీలు కూడా అమలవుతాయనే భరోసాను ఇస్తోంది. ఈ సందర్భంగా కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు సమీపిస్తున్న వేళ లోకేష్ హామీల వర్తమాన స్థితిని ఆంధ్రజ్యోతి అందిస్తోంది.

1700వ కి.మీ

21జూన్2023

డక్కిలి మండల కేంద్రంలో శిలాఫలకం.

హామీ: హ్యాండ్ లూమ్ టెక్స్‌టైల్ పార్కు స్థాపిసాం.

ప్రస్తుత స్థితి: ఇంకా అమలు ప్రయత్నాలు మొదలు కాలేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

100 రోజుల గడువు సమీపిస్తోంది యువ నాయకా!



● నారా లోకేష్ హామీల స్థితిగతులపై గ్రౌండ్ రిపోర్ట్ ● చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆరు చోట్ల శిలాఫలకాలు

తొలి హామీ అమలైంది

బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు



బంగారుపాళ్యం ఆస్పత్రిలో డయాలసిస్ పరికరాలు అమర్చుతున్న దృశ్యం

ప్రస్తుత స్థితి: పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని పరిసరాల గ్రామాల్లో కిడ్నీవ్యాధిగ్రస్థులు డయాలసిస్ చేసుకోవాలంటే వ్యయప్రయాసలకోర్చి తిరుపతి, వేలూరు, చిత్తూరు ఆస్పత్రులకు వెళ్ళాల్సివచ్చేది. దీన్ని గుర్తించిన స్థానిక టీడీపీ నాయకులు, మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్పీ జయప్రకాష్ వినతి మేరకు బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌కు విన్నవించారు. ఆయన స్పందించి వెంటనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడానికి హామీ ఇచ్చి, అదేరోజు శిలాఫలకం కూడా ఆవిష్కరించారు. ఇప్పుడది అమలు రూపు దాల్చింది. నారా లోకేష్ అభ్యర్థనతో కేంద్ర ప్రభుత్వం ప్రైమ్ మినిస్టర్ నేషనల్ డయాలసిస్ ప్రోగ్రామ్ పథకం కింద ఒక్కోటి రూ. 50 లక్షల విలువ చేసే ఐదు డయాలసిస్ పరికరాలను బంగారుపాళ్యం ఆస్పత్రికి కేటాయించింది. ఇవి పదిహేను రోజుల కిందట ఆస్పత్రికి చేరుకున్నాయి. కొత్తగా నిర్మించిన ఆస్పత్రి భవనంలో వీటిని అమర్చుతున్నారు. కొత్త కేంద్రంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సుమారు 30 మంది కిడ్నీ బాధితులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఈ డయాలసిస్ కేంద్రంలో ప్రత్యేక వైద్యనిపుణులతో పాటు సిబ్బంది అందుబాటులో ఉంటూ కిడ్నీ వ్యాధి బాధితులకు డయాలసిస్ సేవలు అందజేయనున్నారు.



నాలాంటి వారికి వరం



ఏడు సంవత్సరాలుగా నేను కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నా. కుప్పంలోని పీఈఎస్ మెడికల్ కళాశాలలో కొంతకాలం డయాలసిస్ చేసుకున్నా.ప్రస్తుతం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ చేసుకుంటున్నా. డయాలసిస్ పేషెంట్‌గా బస్సు ప్రయాణాల్లో నరకం అనుభవిస్తున్నా. నా లాంటి బాధితులకు బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు ఓ వరంలా భావిస్తున్నా. నారా లోకేష్‌కు కృతజ్ఞతలు.

- రామయ్య, బంగారుపాళ్యం దళితవాడ

సంతోషంగా ఉంది



మా ఇంటికి కూతవేటు దూరంలోనే నారా లోకేష్ చొరవతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటవుతోంది. నేను వారానికి మూడు సార్లు చిత్తూరుకు వెళ్ళి డయాలసిస్ చేసుకుని వస్తుంటా. ఇక ముందు ఈ తిప్పలు ఉండవంటేనే హాయిగా ఉంది. ఇప్పటికే నేను బంగారుపాళ్యం కేంద్రానికి వెళ్ళి పేరు నమోదు చేసుకున్నా.

- రాజేంద్ర, బంగారుపాళ్యం దళితవాడ

ఆక్వాకు ఊరట

1800వ కి.మీ

26 జూన్ 2023

చిట్టమూరు మండలం అరవపాలెంలో శిలాఫలకం.

హామీ: ఆక్వా రంగానికి గతంలో ఇచ్చిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలు పునరుద్ధరించి ఆదుకుంటాం.

ప్రస్తుత స్థితి: గత ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్‌లుగా విభజించి విద్యుత్ ఛార్జీలు వేర్వేరుగా వసూలు చేసింది. ఆక్వా జోన్‌లో యూనిట్‌కు రూ. 2, నాన్ జోన్‌లో యూనిట్‌కు రూ. 4 నుంచీ రూ. 7 వరకూ వసూలు చేసింది. ఇపుడు కూటమి ప్రభుత్వం వచ్చాక జోన్లు ఎత్తివేసి అన్ని చోట్లా యూనిట్‌కు రూ. 2 వసూలు చేస్తున్నారు. నారా లోకేష్ హామీల అమలులో భాగంగా ఇదొక ఊరట. అలాగే మిగిలిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలపై అధ్యయనం చేయాలని లోకేష్ అధికారులను ఆదేశించారు.



చిట్టమూరు మండలం అరవపాలెంలో శిలాఫలకం

200వ కి.మీ

11 ఫిబ్రవరి 2023

కార్వేటినగరం మండలం కత్తిరిపల్లి వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

హామీ: వంద రోజుల్లోనే గంగాధర నెల్లూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తా.

ప్రస్తుత స్థితి: డిగ్రీ కళాశాల ఏర్పాటు దిశగా ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దశాబ్దాలుగా ఈ ప్రాంత విద్యార్థులు డిగ్రీ కోర్సుల కోసం చిత్తూరు, కార్వేటినగరం, పుత్తూరు వెళ్ళాల్సి వస్తోంది. ఇక్కడ కాలేజీ ఏర్పాటైతే పెనుమూరు, జీడీ నెల్లూరు, పాలసముద్రం, శ్రీరంగరాజపురం మండలాల విద్యార్థులకు అనుకూలంగా వుంటుంది.



300వ కి.మీ

19 ఫిబ్రవరి 2023

శ్రీకాళహస్తి మండలం తొండమానుపురంలో శిలాఫలకం.

హామీ: తొండమానుపురం కేంద్రంగా చుట్టుపక్కల 13 గ్రామాలకు రక్షిత తాగునీటి పథకం ఏర్పాటు చేయిస్తా.

ప్రస్తుత స్థితి: ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

400వ కి.మీ

1 మార్చి 2023

నేంద్రగుంటలో శిలాఫలకం.

హామీ: నేంద్రగుంటలో పది పడకల సామర్థ్యంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయిస్తా.

ప్రస్తుత స్థితి: ఈ దిశగా ఇప్పటి దాకా ఎలాంటి చర్యలూ లేవు. నేంద్రగుంటలో ఎప్పటి నుంచో ఆరోగ్య ఉప కేంద్రం వుంది. ఇది పాకాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోకి వస్తుంది.నేంద్రగుంట, పరిసర గ్రామాల ప్రజలు వైద్య చికిత్స కోసం పాకాల, పి.కొత్తకోట పీహెచ్‌సీలకు గానీ, చంద్రగిరి కమ్యూనిటీ ఆసుపత్రికి గానీ వెళ్లాలి. జాతీయ రహదారిపై వున్న నేంద్రగుంటలో పది పడకల సామర్థ్యంతో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే పరిసర గ్రామాల వారికే కాకుండా ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలకు కూడా ఉపయోగపడుతుంది.



పాకాల మండలం నేంద్రగుంటలో శిలాఫలకం

వరద బాధితులకు ఎస్వీయూ ఉద్యోగుల ఒక రోజు వేతనం

మంత్రి లోకేష్‌కు రూ.47 లక్షల 48 వేల చెక్కు అందజేత



మంత్రి లోకేష్‌కు విరాళం అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 17: వరద బాధితుల కోసం ఎస్వీ యూనివర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్, రిటైర్డు ఉద్యోగులు ఒక రోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. ఇందుకు సంబంధించి రూ.47.48 లక్షల చెక్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు మంగళవారం అందజేశారు. ఉద్యోగుల దాతృత్వాన్ని మంత్రి అభినందించారు.

రూ. వంద ఇస్తేనే మస్టర్ వేస్తా

● ఉపాధి కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్ మాటల వీడియో వైరల్

నాగలాపురం, సెప్టెంబరు 17: ఉపాధి పనులు కావాలన్నా.. బిల్లులు మంజూరు చేయాలన్నా కార్డుకు రూ.వంద కట్టాల్సిందే.. లేకపోతే మస్టర్ ఆపేస్తాం.. కూలి డబ్బు రాదు..' అంటూ మండలంలోని ఎస్ఎస్‌పురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మాధవ్ కూలీలను బెదిరిస్తున్న వీడియో ఒకటి వైరల్ అవుతోంది. పై అధికారులు డబ్బు వచ్చిందా అని ఒత్తిడి చేస్తున్నారు.. వారికి నేను ఏమి సమాధానం చెప్పాలి' అంటూ ఆ వీడియోలో హుకుం జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆ గ్రామ పంచాయతీలో దాదాపు 500 జాబ్ కార్డులున్నాయి. వారానికి ఒక్కొక్క కార్డుకు రూ.100 చొప్పున మాధవ్ వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన నెలకు దాదాపు రూ.2లక్షలు వసూలు చేస్తున్నట్లు కూలీలు చెబుతున్నారు. తమకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, డబ్బు ఇచ్చుకోలేమని చెప్పిన కూలీలను పనులు ఇచ్చేది లేదని, మస్టర్ ఆపేస్తానని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మండలంలో తరచూ జరుగుతున్నా సంబంధిత ఏపీవో పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



కూలీలను బెదిరిస్తున్న మాధవ్

వెనామి రొయ్యలకు 'వైట్‌స్పాట్'

● వైరస్‌తో చనిపోతున్న పిల్లలు

కోట,సెప్టెంబరు17: ఈ ఏడాది వెనామి రొయ్యల సాగు రైతులకు దెబ్బమీద దెబ్బ పడుతోంది. నిన్న మొన్నటి వరకు నకిలీ సీడ్, వాతావరణంలో మార్పులతో నష్టాలను చవిచూశారు. ఇప్పుడు వైట్ స్పాట్ వైరస్‌తో రొయ్యలు చనిపోతుండడంతో లబోదిబోమంటున్నారు. సముద్రతీర మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరులలో సుమారు 2,500 ఎకరాల్లో ఈ రకం రొయ్యలు సాగులో ఉన్నాయి. 3వారాలుగా సాగులో ఉన్న వంద నుంచి 120, 150 కౌంట్ వెనామి రొయ్య పిల్లలకు వైట్‌స్పాట్ వైరస్ ప్రబలింది. వైరస్ సోకిన పిల్లలు మేత తీసుకోవడం మానేస్తున్నాయి. క్రమేపి బరువు తగ్గుతూ పెరుగుదల ఆగిపోతోంది. ఫీడ్ తీసుకోని కారణంగా 120 - 130 కౌంట్ ఉన్న పిల్లలు మొప్పలపై తెల్లని మచ్చ ఏర్పడి చనిపోతున్నాయి. ఇప్పటికే రైతులు రూ.లక్షల్లో నష్టపోయారు. కోట మండలం గోవిందపల్లి, సిద్ధవరం,కొత్తపట్నం, గోవిందపల్లిపాళెం ప్రాంతాల్లో రైతులు తక్కువ కౌంట్‌తో రొయ్యలను పట్టి, అందినకాడికి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. సీడ్ ధర కూడా గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వాతావరణంలో వస్తున్న మార్పులే ఈ వైరస్‌కు కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఇసుక తరలిపోతుంటే ఏమి చేస్తున్నారు?

● ఏర్పేడు తహసీల్దారుపై కలెక్టర్ ఆగ్రహం

ఏర్పేడు, సెప్టెంబరు 17: మండలంలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే ఏమి చేస్తున్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ ఏర్పేడు తహసీల్దారు భార్గవిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అక్రమ రవాణాను అరికట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. ట్రాక్టర్లు, టిప్పర్లను సీజ్ చేసి, పోలీసులకు అప్పగించాలని ఆదేశించినట్లు తెలిసింది. అక్రమ రవాణాకు పాల్పడితే ఎవరైనా వదిలిపెట్టొద్దని, తమకు సమాచారం అందించాలని స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల్లో వీఆర్వోలను ఆదేశించారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

మల్లిమడుగు డ్యాం నుంచి మట్టి అక్రమ తరలింపునకు అడ్డుకట్ట



మట్టి తరలించే ప్రధాన రహదారిలో లారీలు వెళ్లకుండా తీసిన గుంత

రేణిగుంట, సెప్టెంబరు 17: మల్లిమడుగు డ్యాం పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా మట్టి తరలిపోకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. మట్టిదందాపై ఆంధ్రజ్యోతిలో వార్త ఇటీవల ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. మంగళవారం తహసీల్దారు సురేష్‌బాబు నేతృత్వంలో మల్లిమడుగు నుంచి అక్రమ మట్టి తరలించే ప్రధాన రహదారిలో టిప్పర్ లారీలు వెళ్లకుండా ఉండేందుకు జేసీబీ సాయంతో రెండు చోట్ల ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు.

దుకాణాల్లో విజిలెన్సు సోదాలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17: తిరుపతి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, చిత్తూరు తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు మంగళవారం సోదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచిన నేపథ్యంలో కొందరు వ్యాపారులు వంట నూనెలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి, కృత్రిమ కొరత సృష్టిస్తుండడంపై అధికారులు దృష్టి సారించారు. నాలుగు టీములుగా ఏర్పడి తిరుపతి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, చిత్తూరులలో సోదాలు చేశారు. అధిక ధరకు విక్రయిస్తున్న, నోస్టాక్ బోర్డు పెట్టిన 10 దుకాణాలపై కేసులు నమోదు చేశారు.



310 మొబైల్ ఫోన్ల రికవరీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17: రూ.62 లక్షల విలువ చేసే 310 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. రికవరీ చేసిన ఫోన్లను మంగళవారం ఎస్పీ కార్యాలయంలో బాధితులకు అప్పగించారు. ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే మొబైల్ హంట్ లేదా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇప్పటివరకు 10 విడతల్లో రూ.6.07 కోట్ల విలువ చేసే 3,530 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి, బాధితులకు అప్పగించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, వెంకట్రావు, సైబర్ క్రైం సీఐ వినోద్ కుమార్ పాల్గొన్నారు.



రికవరీ చేసిన ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

రెవెన్యూ మాయాజాలంతో నకిలీ రిజిస్ట్రేషన్



నకిలీ రిజిస్ట్రేషన్‌పై సబ్ రిజిస్ట్రార్‌ను ప్రశ్నిస్తున్న దామోదర రెడ్డి

లబోదిబోమంటున్న గంటావారిపల్లెవాసి

పాకాల, సెప్టెంబరు 17: రెవెన్యూ అధికారుల మాయాజాలం, దళారుల జిమ్మిక్కులతో పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల ఓ అక్రమ రిజిస్ట్రేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న బాధితుడు లబోదిబోమంటూ స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని మంగళవారం అధికారులను నిలదీశాడు. బాధితుడి వివరాల మేరకు... వెదురుకుప్పం మండలం జక్కిదొన రెవెన్యూ గంటావారిపల్లెకు చెందిన శ్రీపురం దామోదర రెడ్డి కుటుంబ సభ్యులకు ఆ గ్రామంలో సర్వే నెంబరు 513-16లో 66 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. వీరి అనుభవంలోనే ఉన్న ఆ భూమిలో వరి సాగు చేశారు. ఈ భూమిని ఇటీవల అదే గ్రామానికి చెందిన పుల్లారెడ్డి అనే వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. అతడు మళ్లీ తన కొడుకు పేరుమీద దానవిక్రయం రిజిస్ట్రేషన్ చేశాడు. రెవెన్యూ అధికారుల సహకారంతో 1బి సృష్టించి ఈ తతంగం నడిపించారు. మళ్లీ ఆ సర్వే నెంబర్ విస్తీర్ణం ఆన్‌లైన్‌లో మాయంచేశారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన సీనియర్ అసిస్టెంట్ పెంచల కుమార్ 1బి మేరకు రిజిస్ట్రేషన్ చేసేశాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితుడు మంగళవారం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ హేమంత్‌ను నిలదీశాడు. 1బి ఉండటంతో నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేశామని వివరించారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు, పూతలపట్టు డాక్యుమెంట్ రైటర్ కృష్ణ, మరి కొందరి ప్రమేయం ఉన్నట్లు బాధితుడు ఆరోపించాడు.

అర్హత లేకున్నా అందలం!

- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యం
- జగన్ బాబాయి వైవీ సుబ్బారెడ్డి బంధువు కోసం పదవి సృష్టి
- స్విమ్స్‌లో స్పెషలాఫీసర్‌గా పోస్టు
- పరీక్ష పాసైన రోజుల వ్యవధిలో జయచంద్రారెడ్డికి కీలక నియామకం
- ఫస్ట్ ర్యాంకర్‌నూ పక్కన పెట్టిన వైనం
- టీటీడీ సొమ్ముతో లక్షల వేతనం, రాజభోగం
- పాలన మారినా పట్టించుకోని ప్రభుత్వం
- స్విమ్స్‌లో చర్చనీయాంశమైన వ్యవహారం

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

జగన్ జమానాలో అర్హతలతో సంబంధం లేకుండా అయినవాళ్లను అందలాలెక్కించిన ఉదంతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఎంసీహెచ్ (సర్జికల్ ఆంకాలజీ) కోర్సు పాసైన వారం రోజులకే డాక్టర్ ఎం. జయచంద్రారెడ్డికి శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ(ఎస్‌బీఐఏ) స్పెషల్ ఆఫీసర్‌గా నియమించేశారు. ఆ తర్వాత ప్రతిష్టాత్మక స్విమ్స్‌కు స్పెషల్ ఆఫీసర్‌గా మారిపోయారు. దీనికిగాను ఆయనకున్న ఏకైక అర్హత... అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి సమీప బంధువు కావడమే! చిత్రమేంటంటే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయన అక్కడే ఉండడం!!

వైసీపీ హయాంలో అయిన వారికి పదవులు.. పప్పుబెల్లాలు దోచిపెట్టిన విషయం తెలిసిందే. అయితే, అయినవారికేకాదు.. వారికి అయినవారికీ కూడా ఇష్టారాజ్యంగా పదవులు పంచేశారు. అర్హత లేకున్నా అందలాలు ఎక్కించారు. టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ అధినేత జగన్‌కు బాబాయి వరసయ్యే వైవీ సుబ్బారెడ్డికి సమీప బంధువైన డాక్టర్ ఎం. జయచంద్రారెడ్డికి ఇలానే పదవిని కట్టబెట్టారు. 2022, సెప్టెంబరు 16న శ్రీవేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(స్విమ్స్)లో ఎంసీహెచ్(సర్జికల్ ఆంకాలజీ)కోర్సు పాసైన ఆయనను కనీసం నెల రోజులు కూడా కాకుండానే, ఎలాంటి అనుభవం లేకుండానే శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ(ఎస్‌బీఐఏ) నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. సెప్టెంబరు 16న ఆయన ఆంకాలజీ కోర్సు పాసైతే, సెప్టెంబరు 24న ఆయనను స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలోని టీటీడీ పాలకమండలి(తీర్మానం 258)నిర్ణయం తీసుకుంది. అక్టోబరు 7న అప్పటి స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ భూమా వెంగమ్మ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. రూ.లక్షల్లో వేతనం, కారు, క్వార్టర్స్, చాంబర్.. ఇలా వెంటవెంటనే స్పెషల్ ఆఫీసర్‌కు కేటాయింపులు జరిగిపోయాయి.

నిబంధనలు ఏమైనట్టు?

టీటీడీలో స్పెషల్ ఆఫీసర్ అంటే కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ లేదా రాష్ట్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ హోదాలో ఉన్న అధికారిని డిప్యుటేషన్‌పై మాత్రమే నియమించుకునే నిబంధన ఉంది. టీటీడీ సర్వీస్‌రూల్స్‌కు విరుద్ధంగా వైవీ సుబ్బారెడ్డికి సమీప బంధువు కోసం స్పెషల్ పోస్టును సృష్టించారు. అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డికి ఈ విషయాలు తెలిసి కూడా నోరుమెదపలేదు. అసలు స్విమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య విద్య పాసైన తర్వాత మొదటి సంవత్సరం ముందస్తు ఒప్పందం మేరకు స్విమ్స్‌లో వైద్యుడిగా పనిచేయాలి. జయచంద్రా రెడ్డి విషయంలో ఈ నిబంధనను గాలికి వదిలేశారు.

మెల్లమెల్లగా మొత్తం ఆధీనంలోకి..

ఎస్‌బీఐఏ స్పెషలాఫీసర్‌గా నియమితులైన జయచంద్రారెడ్డి మెల్లమెల్లగా స్విమ్స్‌కే స్పెషల్ ఆఫీసర్‌గా మారిపోయారు. ఆంకాలజీ అనుబంధ విభాగాలతో పాటు, పాథాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాలకు సంబంధించిన పరికరాల కొనుగోలు, సిబ్బంది నియామకాలు, స్విమ్స్-టీటీడీకి లైజన్ ఆఫీసర్ బాధ్యతలను కూడా ఆయనకే అప్పగించారు. స్విమ్స్‌లో 15 మందికి పైగా సీనియర్ ప్రొఫెసర్ల నేతృత్వంలోని మెడికల్, సర్జికల్, రేడియేషన్ ఆంకాలజీ, రేడియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ వంటి అనేక విభాగాలను ఆయన తన అధీనంలోకి తెచ్చుకున్నారు. పలు విభాగాధిపతుల ఫైళ్లను ప్రత్యేకాధికారి ద్వారా రూట్ చేయాలని ఆదేశాలిచ్చారు. ప్రతి ఫైలూ ఆయన దగ్గరకు రావాల్సి ఉండడంతో కీలక నిర్ణయాలన్నింటిలోనూ ఆయన పాత్ర తప్పనిసరైంది. పాత స్విమ్స్ భవనం పునరుద్ధరణ, న్యూరో అండ్ కార్డియో సైన్సెస్ బ్లాక్ నిర్మాణం, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ కోసం పరికరాల కొనుగోలు, మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, డ్రైవర్ల నియామకంలో ఈయన ప్రమేయంతో దారిమళ్లింపులు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి.



నిర్మాణదశలోని శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ



ఫస్ట్ ర్యాంకర్‌ను పక్కనబెట్టి..

రూ.2 లక్షలతో మొదలైన స్పెషలాఫీసర్ జయచంద్రారెడ్డి వేతనం మూడు నెలలు తిరగకుండానే 'ఆయన అడిగారంటూ'.. అకస్మాత్తుగా రూ.3 లక్షలకు పెంచుతూ టీటీడీ నిర్ణయం తీసుకుంది. జయచంద్రారెడ్డితో పాటు ఎంసీహెచ్ పూర్తి చేసిన ఆయన బ్యాచ్‌మేట్ ఒకరు మాత్రం రూ1.5 లక్షల జీతంతో సర్జికల్ ఆంకాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. పైగా ఆయన ఫస్ట్ ర్యాంకర్ కూడా. ఇక స్పెషలాఫీసర్‌కు డ్రైవర్‌తో కూడిన అధికారిక కారు, నివాస వసతి, జాతీయ, అంతర్జాతీయ విమానాల్లో(బిజినెస్ క్లాస్) ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు.

కూటమి సర్కారు వచ్చినా

స్పెషలాఫీసర్ జయచంద్రారెడ్డి దర్జా మామూలుగా ఉండదు. విజయవాడకు విమానంలోనే ప్రయాణిస్తారు. విమానాశ్రయానికి కూడా టీటీడీ కారును పంపుతారు. స్విమ్స్‌లో సీనియర్లయిన డీన్, ఎంఎస్, రిజిస్ట్రార్ వంటి వారికి కూడా ఇలాంటి సదుపాయాలు లేవు. జయచంద్రారెడ్డి పీజీ చేసేటప్పుడు అంటే.. విద్యార్థిగా ఉన్నప్పుడే ఆయనకు స్టాఫ్ క్వార్టర్‌ను కేటాయించినట్టు తెలిసింది. అలాగే ఎంసీహెచ్‌లో అత్యధిక మార్కులు వచ్చినవారికి డాక్టర్ సునీత సుబ్రమణ్యం గోల్డ్ మెడల్‌ను బహూకరిస్తారు. జయచంద్రారెడ్డి కోసం ఈ నిబంధనను మార్చేశారు. బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్ అంటూ ఆ గోల్డ్ మెడల్‌ను ఈయనకే ఇచ్చారు. కాగా, వైసీపీ సర్కారు పోయి కూటమి ప్రభుత్వం వచ్చినా ఈయన హవా కొనసాగుతోంది. జయచంద్రారెడ్డి అదేస్థానంలో కొనసాగుతున్నారు. ఆయన వ్యవహార శైలిలోనూ ఎలాంటి మార్పు రాలేదు.

శాస్త్రోక్తంగా అనంత పద్మనాభ వ్రతం



తిరుమల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో అనంతపద్మనాభ వ్రతం సందర్భంగా మంగళవారం ఉదయం శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది.అనంత పద్మనాభ వ్రతాన్ని ప్రతి ఏడాది తిరుమలలో భాద్రపద శుక్ల చతుర్దశి రోజున నిర్వహిస్తారు. ఈసందర్భంగా శ్రీవారి ఆలయంలో ఉదయం పూజలు చేసిన తర్వాత సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకువెళ్లి వరాహస్వామి ఆలయం వద్దనున్న స్వామి పుష్కరిణిలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేపట్టారు. అనంతరం చక్రస్నానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు, ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుమలలో నేడు పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో బుధవారం పౌర్ణమి గరుడసేవ జరుగనుంది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామి సువర్ణకాంతులీనుతున్న గరుడునిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించనున్నారు.

శ్రీవారి లడ్డూలపై మంచి ఫీడ్‌బ్యాక్ వస్తోంది : ఈవో

తిరుమల, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఇటీవల టీటీడీ అందజేస్తున్న లడ్డూల నాణ్యతపై మంచి ఫీడ్‌బ్యాక్ వస్తోందని ఈవో శ్యామలరావు సంతోషం వ్యక్తం చేశారు. తిరుమలలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొద్దిరోజులుగా లడ్డూల నాణ్యత పెంచేందుకు పలు చర్యలు చేపట్టామన్నారు. త్వరలో లడ్డూల తయారీని పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.శ్రీవారి భక్తుల ఆరోగ్య భద్రతకోసం తిరుమలలోని హోటళ్ల వ్యాపారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. తిరుమలలోని ఆస్థానమండపంలో మంగళవారం టీటీడీ ఆరోగ్య, ఎస్టేట్స్, ఆహార భద్రత విభాగాలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఈవో హోటళ్ల నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడారు. తిరుమలలో అన్ని తినుబండారాల దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఆహార భద్రతా చట్టాలను పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫ్రస్టేషన్‌తోనే తప్పుగా చెప్పానని ఆ భక్తుడు ఒప్పుకున్నాడు

క్యూలైన్లలో అన్నప్రసాదాలు అందలేదని, మూడురోజులుగా కంపార్టుమెంట్లలోనే ఉంచేశారంటూ తమిళనాడుకు చెందిన ఓ భక్తుడు శ్రీవారి దర్శనానికి వచ్చిన దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డికి సోమవారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై టీటీడీ ఈవో శ్యామలరావు మంగళవారం స్పందించారు. ఈ అంశంపై విచారణ చేపట్టామన్నారు. ఫిర్యాదు చేసిన తమిళనాడు భక్తబృందంలో ఆరుగురు పెద్దవాళ్లు, ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారన్నారు. సీసీటీవీ ఫుటేజ్‌లో వీరు సమయానికి అన్నప్రసాదాలు తీసుకున్నట్టు రికార్డయిందన్నారు. భక్తుడిని పిలిపించి ఫుటేజ్ చూపించి ప్రశ్నించామన్నారు. ఈక్రమంలో అన్నప్రసాదాలన్నీ అందాయని, దర్శనానికి ఎక్కువ సమయం వెయిట్ చేసిన క్రమంలో ఫ్రస్టేషన్‌తో మంత్రికి అలా చెప్పామని భక్తుడు తెలిపాడన్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



తిరుమల ఆలయం వద్ద నరసింహన్ - కంచర్ల శ్రీకాంత్ - అవినాష్

తిరుమల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం మాజీ గవర్నర్ నరసింహన్, ఎంపీ గురుమూర్తి,ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, రఘువర్మ,సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆరిమిల్లి రాధాకృష్ణ, మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సుమంత్, నటుడు ముక్కు అవినాష్ దర్శించుకున్నారు.

మానవత సేవాసంస్థకి టీటీడీ ఉద్యోగి విరాళం



నాగరాజాచారిని అభినందిస్తున్న సైకం జయచంద్రారెడ్డి తదితరులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు17: మానవత స్వచ్ఛంద సేవాసంస్థకి టీటీడీ ఉద్యోగి నాగరాజాచారి రూ.70వేలు విరాళాన్ని అందజేశారు. ఈమేరకు చెక్కుని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి చేతులమీదుగా తిరుపతిశాఖ చైర్మన్ భార్గవ, కోచైర్మన్ రాళ్లపల్లి మాధవ నాయుడు, అధ్యక్షుడు ఎంవీ రమణలకు అందించారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. నగరంలో మానవతా సేవలను అందించేందుకు ఇప్పటికే శాంతిరథం, నాలుగు బాడీ ఫ్రీజర్లు అందుబాటులో ఉన్నాయని, మరోబాడీ ఫ్రీజర్‌కోసం నాగరాజాచారి విరాళం అందించడం సంతోషంగా ఉందని అభినందించారు. నాగరాజాచారి మాట్లాడుతూ.. శాంతిరథానికి రూ.3లక్షల విరాళాన్ని అందజేసిన జయచంద్రారెడ్డి స్ఫూర్తితో తాను కూడా ఫ్రీజర్‌కోసం తనవంతు విరాళం అందించానని తెలిపారు. మానవత శాఖలో సేవలందించేందుకు 94414 49525, 62814 33397 నెంబర్లని సంప్రదించాలని కోరారు.

20న బంగారుపాళ్యానికి మంత్రి లోకేశ్ రాక

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 17: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ 20వ తేదీన బంగారుపాళ్యం రానున్నారు. బంగారుపాళ్యం ఆస్పత్రిలో ఏర్పాటు చేయించిన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. తొలుత 19న లోకేశ్ పర్యటన వుంటుందని ప్రచారం జరిగింది. చివరకు 20వ తేదీకి పర్యటన ఖరారైంది.

చీటింగ్ కేసులో ముగ్గురికి ఏడాది జైలు

తిరుపతి(లీగల్), సెప్టెంబరు 17: చీటింగ్ కేసులో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. 4వ అదనపు జిల్లా కోర్టు పరిపాలనాధికారి కె.సూర్యనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు వెస్ట్‌పోలీసు స్టేషన్ పరిధిలో గాంధీపురానికి చెందిన వి.బ్రహ్మయ్య, రామచంద్రాపురం మండలం కుప్పంబాదూరుకు చెందిన ఈ.బాబు, ఎన్.చిన్నబ్బలపై కేసు నమోదుచేసి కోర్టుకు హాజరుపరిచారు. వీరు ఒక కేసుకు సంబంధించి తిరుపతి కోర్టులో సమర్పించిన ష్యూరిటీ అఫిడవిట్లలో పంచాయతీ సెక్రటరీ, రామచంద్రాపురం ఎంపీడీవో సంతకాలు, ఫోర్జరిచేశారు. సీలు కూడా వేసేశారు. అనుమానంతో అధికారులు ఆరాతీయగా సంతకాలు ఫోర్జరీవని తేలింది. సాక్ష్యాలు నిరూపణ కావడంతో ముగ్గురికి ఏడాది పాటు జైలు శిక్ష విధించారు.

కూరగాయల దాతలకు అదనపు ఈవో అభినందనలు

తిరుమల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నప్రసాద వితరణకు కూరగాయలు పంపుతున్న దాతలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అభినందించారు. అన్నమయ్య భవనంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆయన కూరగాయల దాతలతో సమావేశం నిర్వహించారు. మరిన్ని రకాల కూరగాయలను అందించాలని దాతలను కోరారు. తాము ఎల్లప్పుడూ కూరగాయలు పంపేందుకు సంసిద్ధంగా ఉన్నామని దాతలు ముక్తకంఠంతో తెలిపారు. అనంతరం 24 మంది దాతలను అదనపు ఈవో సన్మానించారు.

సంస్కృత వర్సిటీలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్



తిరుపతిరూరల్, సెప్టెంబరు 17: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో మంగళవారం మెగా ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.పరిపాలనా భవనం, ఇండోర్‌స్టేడియంల వద్ద విద్యార్థులతో అధ్యాపకులు కలసి మొక్కలు నాటారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ,అధికారులు సాంబశివమూర్తి, రజనీకాంత్‌శుక్లా, లలితారాణి, కృష్ణేశ్వర, జేబీ చక్రవర్తి, ఎన్ఎస్ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పద్మావతీదేవికి పవిత్రాల సమర్పణ



పవిత్రోత్సవాల్లో ఎమ్మెల్యే నాని దంపతులు



తిరుచానూరు, సెప్టెంబరు 17: తిరుచానూరు పద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఉదయం సహస్రనామార్చన, నిత్యార్చన తరువాత పవిత్ర సమర్పణ నిర్వహించారు. అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవర్లకు, ఉప ఆలయాలకు, పరివార దేవతలకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు, జేఈవో వీరబ్రహ్మం దంపతులు, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ కేపీ చంద్రశేఖర్, శేషగిరి అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి పాల్గొన్నారు. ఎమ్మెల్యే నాని దంపతులు వందకేజీల కుంకుమను ఆలయ అధికారులకు అందజేశారు. అమ్మవారి పవిత్రోత్సవాల్లో పాల్గొని పసుపు, కుంకుమ, సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని ఆలయ అధికారులపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా ఆలయ అధికారుల తీరు మాత్రం మారలేదని, వైసీపీ ప్రతినిధులకు ఇప్పటికూడా ఆలయంలో రాచమర్యాదలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ ప్రతినిధులు వస్తే పట్టించుకోవడంలేదంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందించండి

తిరుచానూరు, సెప్టెంబరు 17: తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో నిశాంత్‌రెడ్డి లేకపోవడంతో ఓటర్ల జాబితా తయారీలో ఉన్న తహసీల్దారు స్థాయి అధికారులను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో అవకతవకలపై గత కొన్ని సంవత్సరాలుగా కలెక్టర్, ఆర్డీవోలను కలుస్తూనే ఉన్నానన్నారు. రుజువులతో కూడిన వినతిపత్రాలను కూడా అందించినట్లు వివరించారు. అధికారులు ఇప్పటికైనా చంద్రగిరి నియోజకవర్గంలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా ఓటర్ల జాబితాను రూపొందించాలన్నారు.

పీఎంఏవై ఇళ్ల ప్రారంభం



పీఎంఏవై ఇళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, సెప్టెంబరు 17: రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలో పీఎంఏవై ఇళ్లను మంగళవారం ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కాలనీలలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకులు శివకోటేశ్వరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్ రేవతి ప్రకాష్‌రెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఔరంగజేబు, రమేష్‌రెడ్డి, బాలకృష్ణమూర్తి, పూలనాగరాజు, ఎంపీడీవో బాలాజీ నాయక్, హౌసింగ్ ఏఈలు శ్రీరాములురెడ్డి, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాలగ్రామ వెంకన్న గుడిలో పితృపక్ష అన్నదానం ప్రారంభం

తిరుచానూరు, సెప్టెంబరు 17: తిరుచానూరు సమీపంలోని యోగిమల్లవరం సాలగ్రామ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి 16 రోజుల పాటు నిర్వహించనున్న పితృపక్ష అన్నదానాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. నారద పీఠం అన్నదాన సమాజం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. నానికి అర్చకులు వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. పీఠం వ్యవస్థాపకులు దినేష్, సాలగ్రామ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహణ మండలి సభ్యులు మోహన్‌రాజా, సుశీలమ్మ, దీప, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో 32 మంది బైండోవర్

తిరుమల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గుర్తింపు కార్డులు లేని 32 మందిపై తిరుమల పోలీసులు బైండోవర్ కేసులు పెట్టారు. వారిని మంగళవారం తిరుపతి తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టారు. తిరుమలలో నివాసముంటున్న ప్రతి ఒక్కరూ సరైన గుర్తింపుకార్డులతో ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

వాటర్‌ప్లాంట్ల ప్రారంభం



రామచంద్రాపురం, సెప్టెంబరు 17: మండలంలోని రామాపురం, మెట్టూరు దళితవాడ, బలిజపల్లెల్లో మంగళవారం వాటర్‌ప్లాంట్లను ఎమ్మెల్యే నాని ప్రారంభించారు. రామాపురంలో పొలం పిలుస్తోంది పోస్టర్‌ను అధికారులతోకలిసి ఆవిష్కరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు చిన్నబాబు, జనార్దన చౌదరి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, విజయకుమార్, ఉమాపతి నాయుడు, జేడీ జగన్, డిల్లీనాథరెడ్డి, న్యాయవాది మునెయ్య, ధనంజయరెడ్డి, కాసర్ల వేణుగోపాల్ నాయుడు, సర్పంచ్ కావ్య, ఎల్ సురేంద్ర నాయుడు,దినేష్, వసంత నాయుడు,జయచంద్ర నాయుడు, ప్రసాద్, రాజేష్, మునిరామిరెడ్డి, మనోజ్ రాయల్ పాల్గొన్నారు.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

రామచంద్రాపురం,సెప్టెంబరు17: నెత్తకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 19 నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో మార్కొండయ్య నాయుడు,జయవేలు తెలిపారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ 19, 20వ తేదీల్లో నెత్తకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని అండర్-14, అండర్-17 కేటగిరిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్,చెస్, యోగా, బ్యాడ్మింటన్,అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి భ కనబరచిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నా రు.అర్హులైన విద్యార్థులు యూనిఫాం,ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు

పాకాల, సెప్టెంబరు 17: మామిడి తోటల్లో సస్యరక్షణ చేపట్టాలని ఉద్యాన అధికారిణి శైలజ అన్నారు. మండలంలోని మొగరాల పరిసరాలలో మంగళవారం ఆమె మామిడితోటలను పరిశీలించారు. మామిడి చెట్ల ప్రధాన కాండం, పక్క కొమ్మలపై తెలీంద్రం ఉందని గుర్తించారు.

ప్రకృతి వ్యవసాయంలో రైతులే శాస్త్రవేత్తలు

- మెక్సికో బృందం కితాబు



వరి పంటను పరిశీలిస్తున్న మెక్సికో బృందం

రామచంద్రాపురం, సెప్టెంబరు 17: రాష్ట్రంలోని రైతులు ప్రకృతి వ్యవసాయంలో శాస్త్రవేత్తలుగా మారే విధానం బాగుందని మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డీయాజ్ మరియా అన్నారు. గొల్లపల్లి గ్రామరైతు నాగరాజు పొలంలో మెక్సికో బృందం మంగళవారం విత్తనాలు నాటి ఏగ్రేడ్ గ్రాత్ క్రూపింగ్ మోడల్ పద్ధతిని పరిశీలించారు. ఘన జీవామృతం, బీజామృతంతో పాటు విత్తనశుద్ధి తయారీలను రైతులనుంచి అడిగి తెలుసుకున్నారు. కొత్తకండ్రిగపంచాయతీ టీవీసపార్లు, కుప్పం బాదూరు గ్రామాల్లో సూర్యమండల నమూనాల సాగు, కూరగాయల పంటలను పరిశీలించారు. రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు చక్రాల చంద్రశేఖర, సురేష్‌బాబు, స్మిత జాకోబ్, డాక్టర్ రాజగోపాల్, ఏపీపీఎల్ఎస్ జిల్లా ప్రాజెక్టు మేనేజరు షణ్ముగం, అదనపు మేనేజరు పట్టాభిరెడ్డి, సీనియర్ కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి, ప్రాంతీయ టెక్నికల్ ఆఫీసర్ రవిచంద్రప్రసాద్, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్

చంద్రగిరి, సెప్టెంబరు 17: నరసింగాపురం సమీపంలోని స్వర్ణముఖినదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. స్వర్ణముఖినదిలో అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్నారని సమాచారం అందడంతో, తహసీల్దార్ శివరామసుబ్బయ్యతో పాటు, రెవెన్యూ సిబ్బంది దాడులు నిర్వహించారు. నాలుగు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. వీఆర్వోలు విజయ్, వాసు, భాస్కర్, హరి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతలో ప్రజలను భాగస్వాములుగా చేయండి

తిరుచానూరు, సెప్టెంబరు 17: పరిసరాల పరిశుభ్రతలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని పంచాయతీ అధికారులకు డీఎల్‌పీవో రూపారాణి సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తిరుచానూరు పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో గ్రామస్థులు, పాఠశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు. **చంద్రగిరి:** చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో పాతపేట, కొత్తపేట వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం టవర్ క్లాక్ వద్ద మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ ఈవో మహేశ్వరయ్య, ఎంపీటీసీలు మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **భాకరాపేట:** చిన్నగొట్టిగల్లు మండలంలోని అన్ని గ్రామాలలో విద్యార్థులు, రాజకీయ నాయకులు, వైద్య సిబ్బందితో కలిసి మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో సోమశేఖరరెడ్డి, తహసీల్దారు జనార్దన్‌రాజు, సర్పంచులు, అధికారులు, విద్యార్థులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. **పాకాల:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత అని జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి అన్నారు. ఎంపీడీవో ప్రభాకర్, తహశీల్దార్ నిత్యానందబాబు, ఈవోఆర్డీ మాలతి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మోహిద్దీన్ బాషా, వెలుగు ఉపాధిహామి కార్యాలయాల సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాకాలలో ర్యాలీ నిర్వహించి, ఆర్టీసీ బస్టాండు ఎదుట మానవహారం ఏర్పాటు చేశారు. పాకాల పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి, రైల్వే స్టేషన్ ఎదుట పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ కస్తూరి, పంచాయతీ కార్యదర్శి మోతీ, సిబ్బంది పాల్గొన్నారు.

పాకాలలో మానవహారం



ఓటర్ల సర్వేలో జాప్యం చేస్తే చర్యలు

తిరుపతి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి) : ఓటర్ల సర్వే వేగంగా నిర్వహించాలని తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎస్.మౌర్య అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటి ఓటర్ల సర్వే నిర్వహణపై మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఓటర్ల సర్వే ఆలస్యంగా జరుగుతోందన్నారు. ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు పరిశీలించాలన్నారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో డీసీ అమరయ్య, అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మిలు ఉన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 17 : పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్ అన్నారు. రుయాస్పత్రిలో మంగళవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిపి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు గత సమావేశంలోని అంశాలను, తీర్మానాలను వివరించారు. ఆక్సిజన్ పైపులైన్ల నిర్వహణకు టెండర్ల ప్రక్రియను నెలలోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గతంలో కొవిడ్ వార్డుల్లో ఉపయోగించిన ఏసీలను డ్యూటీ డాక్టర్ల గదుల్లో, అత్యవసర మెడిసిన్ గదుల్లో ఉపయోగించుకోవాలన్నారు. మహాప్రస్థానం వాహనాల సంఖ్యను పెంచాలన్నారు. ఈ వాహనాలు అందుబాటులో లేని సమయంలో ఆస్పత్రి నిధులతో రోగులకు మరో వాహనం సమకూర్చాలన్నారు. కమిటీ సభ్యులు ఎంపీ గురుమూర్తి, లక్ష్మీపతి, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, ఏపీఎంఐడీసీ ఈఈ శివరామిరెడ్డి, డీఎంహెచ్‌వో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

భలే మంచి చౌకబేరమూ..

● ఎగబడ్డ కొనుగోలుదారులు



తిరుమల బైపాస్‌రోడ్డులో కొనుగోలుదారులతో కిక్కిరిసిన దుకాణం

తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 17: తిరుమల బైపాస్‌రోడ్డులోని ట్రాడ్‌ఐ దుకాణ నిర్వాహకులు మంగళవారం మాన్‌సూన్ సేల్ అంటూ 90శాతం ఆఫర్‌తో ఎలక్ట్రానిక్ వస్తువులు సేల్ అంటూ ప్రకటించడంతో కొనుగోలుదారులు ఎగబడ్డారు. సీసీ కెమెరాలు, ఫర్నిచర్స్, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్, ఎల్ఈడీ లైట్స్, హోమ్ థియేటర్స్, ప్రొజెక్టర్స్, సోలార్ లైట్స్ తదితరాలను 90 శాతం ఆఫర్‌తో అమ్మకాలు జరిపారు. ఇది చూసిన జనం పెద్ద సంఖ్యలో కొనుగోలుకు రావడంతో దుకాణం కిక్కిరిసింది. రోడ్డుపైనే అధిక సంఖ్యలో ద్విచక్రవాహనాలు నిలపడంతో రాకపోకలకు కొంత ఇబ్బందిగా మారింది.

పిల్లలను పనిలో పెట్టుకుంటే వాహన మెకానిక్‌లపై చర్యలు



మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడికి కరపత్రాలను అందజేస్తున్న లేబర్‌శాఖ అధికారులు

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 17: లేబర్ చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తిరుపతి టూవీలర్ మెకానిక్స్ అసోసియేషన్ నేతలను, మెకానిక్‌లను లేబర్ కమిషనర్ లల్లప్ప, అధికారులు లక్ష్మీనారాయణ, రాజయ్య, ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు వారు మంగళవారం అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డిని కలిసి కార్మిక శాఖ చట్టాల వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమన్నారు. వారిని పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

హాజరు తగ్గితే పరీక్షలకు అనుమతి నిరాకరణ

ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 17: హాజరు శాతం తగ్గితే ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షలకు అనుమతించబోమని ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు పీజీ విద్యార్థులకు స్పష్టం చేశారు. యూనివర్సిటీ పరిధిలో పీజీ తొలి దశలో అడ్మిషన్లు పొందిన వారికి మంగళవారం తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలని ఆయన కోరారు. హాజరు తగ్గితే స్కాలర్‌షిప్ కూడా పొందే అవకాశం ఉండదని రిజిస్ట్రార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్య వర్క్‌పై మహిళలకు శిక్షణ



శిక్షణ పొందుతున్న మహిళలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 17: ఆర్య వర్క్‌పై మహిళలకు వారం రోజుల పాటు శిక్షణ పొందనున్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ పెరుమాళ్లపల్లెలో ఈ శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. దీనిని వర్సిటీ ఉమెన్ స్టడీస్ అధ్యాపకురాలు ఉమాదేవి పర్యవేక్షిస్తున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి శిక్షణ ఉపకరిస్తుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యం



విద్యార్థి నోటిలో మాత్ర వేస్తున్న కలెక్టర్

తిరుపతి (విద్య), సెప్టెంబరు 17: నులిపురుగుల నిర్మూలనతోనే విద్యార్థులకు మానసిక, శారీరక ఆరోగ్యం చేకూరుతుందని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ కార్యక్రమం జరిగింది. తిరుపతిలోని పండిట్ జవహర్‌లాల్ నగరపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన మాత్రల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. అల్బెండజోల్-400 మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శ్రీహరి, డీఈఓ శేఖర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధారాణి, హరిత, జిల్లా ప్రోగ్రా అధికారి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ విగ్రహం వద్ద పుష్పాంజలి

తిరుపతి(విద్య), సెప్టెంబరు 17: జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి అర్బన్: అలిపిరి సమీపంలోని ఎస్వీ శిల్ప కళాశాలలో మంగళవారం భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. అర్చకస్వాములు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రత అందరి బాధ్యత

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



నగరంలో 'స్వచ్ఛత హి సేవ' ర్యాలీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు

తిరుపతి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం కమిషనర్ ఎన్.మౌర్య పేర్కొన్నారు. 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో భాగంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మహతి ఆడిటోరియం నుంచి తారకరామ స్టేడియం వరకు నిర్వహించిన ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత కూడా అంతే ముఖ్యమన్నారు. మోదీ స్ఫూర్తితో రాష్ట్రంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు అమలు చేస్తున్నారన్నారు. తిరుపతిని స్వచ్ఛత హి సేవలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో సిబ్బందికి సహకరించాలన్నారు. కమిషనర్ నారపరెడ్డి మౌర్య మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీ అమరయ్య, మహిళా వర్సిటీ వీసీ ప్రొఫసర్ ఉమా, రిజిస్ట్రార్ రజని, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి, టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, సెట్విన్ సీఈవో మురళికృష్ణ, మున్సిపల్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు దరఖాస్తులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 17: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడపజోన్ ఈడీ చెంగల్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డీజిల్ మెకానిక్ 97, మోటార్ మెకానిక్ 6, ఎలక్ట్రీషియన్ 25, వెల్డర్ 4, పెయింటర్ 2, ఫిట్టర్ 9, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ఒకటి పోస్టులు ఖాళీలున్నాయి. దీనికి నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని ఎస్పీఎస్ఆర్‌లో ఐటీఐలో ఉత్తీర్ణులైనవారు మాత్రమే అర్హులు. అక్టోబరు 3వతేది లోపు ఆర్టీసీ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 9154291408 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

తిరుపతి రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత హి సేవా

తిరుపతి,(ఆటోనగర్) సెప్టెంబరు17: తిరుపతి రైల్వే స్టేషన్‌లో మంగళవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేషన్ ప్రాంగణంలో స్టేషన్ మేనేజరు అధ్వర్యంలో పరిశుభ్రత పనులు చేపట్టారు. ఎస్ఎంఆర్ డాక్టర్ చిన్నప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధుల కొరత ఉన్నా అభివృద్ధికి కృషి

శెట్టిపల్లి భూ బాధితులతో కమిషనర్ మౌర్య



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 17: నిధుల కొరత అడ్డంకిగా ఉన్నా వీలున్న మేర శెట్టిపల్లె ప్రాంతంలో అభివృద్ధికి కృషి చేస్తామని నగర పాలకసంస్థ కమిషనర్ మౌర్య అన్నారు. మంగళవారం ఆమె శెట్టిపల్లె భూముల ప్రాంతానికి చేరుకొని మ్యాప్‌ద్వారా పరిశీలించారు. ఈ భూముల వివరలాను అర్బన్ కార్యాలయ డీటీ అశోక్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులతో మాట్లాడారు. శెట్టిపల్లి భూరక్షణ కమిటీ అధ్యక్షుడు రాధాకృష్ణ మాట్లాడుతూ ప్లాట్లు కేటాయించాలని, రోడ్లు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని, జీ ప్లస్ త్రీ అప్రూవల్ చేయాలని కోరారు. కమిషన్ స్పందిస్తూ తుడా పరిధిలో ప్లాట్స్ వేసి విక్రయించి వచ్చిన నగదుతో అభివృద్ధి చేయవచ్చునన్నారు. తుడాలో నిధుల కొరత ఉన్నందునగత ప్రభుత్వం కార్పొరేషన్‌కు మార్చిందని గుర్తుచేశారు. నిధులకు సంబంధించి తుడా, కార్పొరేషన్ వేర్వేరని కమిషనర్ సర్దిచెప్పేదుకు ప్రయత్నం చేశారు. ఈ దశలో కొందరు బాధితులు కల్పించుకొని ప్రస్తుతానికి మట్టి రోడ్డువేసి విడతలవారీగా అభివృద్ధి చేయాలని కోరారు. దీంతో మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రోడ్లు వేయడానికి ఎంత ఖర్చు అవుతుందో అంచనాలు తయారుచేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ అంశంలో తక్షణ చర్యల కోసం కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

పరిష్కారానికి చర్యలు తీసుకోండి

తిరుపతి (విద్య), సెప్టెంబరు 17: శెట్టిపల్లి భూములు, స్థలాల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య రెవెన్యూ, మున్సిపల్ ఇంజనీరింగ్, ప్లానింగ్ అధికారులు, శెట్టిపల్లి సాధన సమితి ప్రతినిధులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని సమితి కలెక్టర్ ప్రతినిధులకు చెప్పారు.

మహిళలకు వైద్య పరీక్షలు



తిరుపతి, (ఆటోనగర్) సెప్టెంబరు17: నగర పరిధిలో టాటా ట్రస్ట్ క్యాన్సర్ ఆసుపత్రి నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని ట్రస్ట్ పౌరసంబంధాల అధికారి హేమంత్ కుమార్ మహిళలను కోరారు. స్థానిక భవానీనగర్ రాస్ క్లస్టర్ పరిధిలో మంగళవారం ఈ ట్రస్ట్ అధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వరీక్షలను నిర్వహించారు. 150 మంది మహిళలకు రొమ్ము,గర్భాశయ,నోటి క్యాన్సర్‌తో పాటు పలు రకాల వైద్యపరీక్షలు చేశామని ఆయన వివరించారు. కరుణాకర్,మంజుల, సుహాసిని,రాధిక,శ్రీలక్ష్మీ,విజయ,గిరిజ, పుష్పాంజలి మహిళలు పాల్గొన్నారు,

ఏచూరికి నేతల నివాళి



ఏచూరికి నివాళులర్పిస్తున్న చింతా మోహన్, వామపక్ష నాయకులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 17 నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన వామపక్ష నేత సీతారాం ఏచూరి వంటి గొప్ప నేత భౌతికంగా దూరం కావడం బాధాకరమని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి ప్రజల కోసం చేసిన పోరాటాలు, త్యాగాలను గుర్తు చేసుకున్నారు. సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, కమ్యూనిస్టు నేతలు వందవాసి నాగరాజు, కుమార్‌రెడ్డి, రాయపనేని హరికృష్ణ, ఎమ్మెల్సీ శ్రీనివాసులరెడ్డి, కాంగ్రెస్ నేతలు గోపీ గౌడ్, రవి, తేజోవతి, శాంతి యాదవ్, ముని శోభ తదితరులు పాల్గొన్నారు.

19, 22 తేదీల్లో స్కూల్ గేమ్స్ సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 17: ఈనెల 19, 22 తేదీల్లో స్కూల్‌గేమ్స్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జయరామయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి, చిత్తూరుజిల్లాల పరిధిలో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలబాలికలు మాత్రమే (01-01-2006 తరువాత జన్మించిన)అర్హులన్నారు. ప్రస్తుతం చదువుతున్న కళాశాల స్టడీసర్టిఫికెట్, ఆధార్, పదవ తరగతి మార్కులిస్టు తప్పక తీసుకురావాలన్నారు.మరిన్ని వివరాల కోసం 9393621004 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

టేబుల్ టెన్నిస్ (అండర్ 19విభాగం) : శ్రీకాళహస్తి ఆర్‌పీబీఎస్ జడ్పీహైస్కూల్‌లో వేదికగా గురువారం మధ్యాహ్నం 2గంటలకు. ● **మెడరన్ పెంటాథలన్(అండర్ 17, 19 విభాగాలు) :** స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయం వేదిక 22న ఉదయం 9.15గంటలకు.

ఆర్టీసీలో పరిశుభ్రత పక్షోత్సవాలు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 17: ఆర్టీసీ తిరుపతి డిపో గ్యారేజీలో మంగళవారం పరిశుభ్రత పక్షోత్సవాలను ప్రారంభించారు. కడప్ జోన్ ఈడీ చెంగల్‌రెడ్డి హాజరై పరిశుభ్రత గురించి వివరించారు. ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బాలాజీ, అసిస్టెంట్ మేనేజర్ వేణు, అసిస్టెంట్ ఇంజనీర్ చాందిని, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 17: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా స్థానిక గాంధీరోడ్డులోని కస్తూర్బాగాంధీ కేంద్ర ట్రస్టు కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్టు ఛైర్మన్ పీవీ రాయలు ఆధ్వర్యంలో తొలుత కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం వెయ్యిమందికి అన్నదానం చేశారు. బీజేపీ జాతీయ కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, అజయ్‌కుమార్, పెనుబాల చంద్రశేఖర్, జల్లి మధుసూదన్, ప్రశాంత్‌రాజు, కిషోర్, మధుసూదన్‌రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

రోగుల భద్రతపై వైద్యసిబ్బంది ర్యాలీ

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 17 : రోగులకు తగిన వైద్య సేవలు అందించాలని రుయాస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు వైద్యులు, సిబ్బందిని కోరారు. ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో మంగళవారం రుయాస్పత్రి నుంచి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ మాజీ డీన్‌కు జీవితసాఫల్య పురస్కారం



చంద్రశేఖరరావు

తిరుపతిరూరల్, సెప్టెంబరు17: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ మాజీ డీన్ డాక్టర్ టీఎస్ చంద్రశేఖరరావుకు జీవితసాఫల్య పురస్కారం లభించింది. పశు శరీర నిర్మాణ శాస్త్రంలో చేసిన సేవలకు గుర్తింపుగా జాతీయ పశు శరీర నిర్మాణ శాస్త్రవేత్తల సంఘం ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ వెటర్నరీ అనాటమిస్ట్ సెక్రటరీ డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. అక్టోబరు 24న మధురలో జరిగే జాతీయ సదస్సుల్లో ఈపురస్కారాన్ని (డాక్టర్ ఎల్ఎస్ దాస్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు-2024) ప్రదానం చేయనున్నారు.

ప్రభుత్వ నేతల్ని దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17: ముఖ్యమంత్రి,ఉపముఖ్యమంత్రులను ఉద్దేశించి ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడిన గుర్తు తెలియని వ్యక్తిపై తెలుగుదేశం పార్టీ నాయకులు బాబు నాయుడు, ఉప్పలపాటి శ్రీనివాస చౌదరి తదితరులు మంగళవారం అలిపిరి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల మేరకు... తిరుపతి సోషల్ మీడియా గ్రూపులో ఉన్న జిల్లా నాయకుడు రవినాయుడు వ్యక్తిగత మొబైల్ నంబరుకు సోమవారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. చంద్రబాబును తీవ్ర పదాలతో విమర్శించారు. సోషల్ మీడియాలో వచ్చిన పోస్టుల గురించి ప్రస్తావిస్తూ బూతు మాటలతో దూర్భాషలాడాడు. సదరు వ్యక్తి వాయిస్ మేసేజ్‌లు, సంభాషణ, ఫోన్ నంబర్లు ఆధారంగా టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బీసీ గురుకుల బాలికల పాఠశాలలో టీచరు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 17: తిరుపతి జూపార్క్ రోడ్డులోని బీసీ గురుకుల బాలికల పాఠశాల(ఉదయమాణిక్యం)లో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫిజికల్ సైన్స్ టీచరు పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.రేష్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్ చదివి, బీఈడీ చేసినవారు అర్హులని,ఆంగ్ల మాధ్యమంలో బోధన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9000781385 సెల్ నంబరులో సంప్రదించవచ్చన్నారు.

వరద బాధితులకు విరాళాలు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 17: వరద బాధితుల సహాయార్థం తిరుపతి మున్సిపల్ శాఖతోపాటు పలువురు మంగళవారం కలెక్టర్‌కు విరాళాలు అందజేశారు. నగరపాలక సంస్థ తరపున కమిషనర్ మౌర్య రూ.4.90 లక్షల చెక్కును అందజేశారు. కోట మండలం మహాలక్ష్మి హ్యాచరీస్ యజమాని సాగర్‌రెడ్డి రూ.లక్ష, వాకాడు మండలం ఆంజనేయ మెరైన్ హ్యాచరీస్ యజమాని జితేష్ రూ.లక్ష చెక్‌లను అందజేశారు. తిరుపతికి చెందిన గౌతం, ది చైల్డ్ విద్యాసంస్థల యాజమాన్యం మూడు రోజులు పాటు అక్కడే ఉండి రూ. 5 లక్షల విలువజేసే 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, మహిళలకు చీరలు పంపిణీ చేసింది. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్, పార్లమెంట్ అధ్యక్షుడు సుబ్బయ్యలు సీఎంకు రూ.1.5 లక్షలు వరద విరాళంగా అందజేశారు.



కలెక్టర్‌కు చెక్ అందజేస్తున్న కమిషనర్ మౌర్య, మహాలక్ష్మి హ్యాచరీస్ యజమాని సాగర్‌రెడ్డి - విజయవాడలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న గౌతం, ది చైల్డ్ విద్యాసంస్థల యాజమాన్యం

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట పంచాయతీ చెంచువారి కాలనీలో మంగళవారం నాలుగేళ్ల బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. సీఐ చిన్నగోవింద వివరాల మేరకు... చెంచువారి కాలనీకి చెందిన రాయలమ్మ తన నాలుగేళ్ల కుమారుడు మనోజ్‌ను ఇంటి పక్కనే ఉన్న సాకలి చంద్రికకు అప్పగించి భోజనం తీసుకురావడానికి హోటల్‌కు వెళ్లింది. భోజనం తీసుకుని తిరిగి వస్తుండగా చంద్రిక మనోజ్‌ను భుజంపై ఎత్తుకుని ఎదురుపడింది. అవాక్కయిన రాయలమ్మ ఏమైందని ప్రశ్నించగా మనోజ్ నిద్రపోయాడని, ఎంతలేపినా లేవడం లేదని చెప్పింది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా బాలుడు మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ఒంటిపై, మెడపై రక్త గాయాలు ఉండడంతో అనుమానంతో రాయలమ్మ ఎమ్మార్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

గంగమ్మకు పూజలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 17: మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ నాయకులు మంగళవారం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో పూజలు చేశారు. అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. పార్టీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, చంద్రబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

స్కూల్ ఆటో బోల్తా

ఐదుగురు విద్యార్థులకు గాయాలు


ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

వాకాడు, సెప్టెంబరు 17: పాఠశాలకు పిల్లలను తరలిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటన వాకాడు మండలంలోని కాశీపురం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. కాశీపురం నుంచి విద్యార్థులు చిట్టమూరు మండలం మెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆటోలో రోజూ వెళ్లి వస్తుంటారు. అధిక సంఖ్యలో విద్యార్థులు ఉండటం, డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో కాశీపురం స్వర్ణముఖినది ఒడ్డుపై ఆటో నదిలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు అమృత వర్ష, హిమబిందు, జశ్వంత్, లోకేష్, మాధవి గాయపడ్డారు. వీరిని వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 17: స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల సమీపంలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును ఇద్దరు వ్యక్తులు అపహరించుకు వెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ శ్రీనివాస్ కథనం మేరకు.. స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో తిలక్‌నగర్‌కు చెందిన అనురాధ దుకాణం నిర్వహిస్తోంది. మంగళవారం గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తు మోటారు సైకిల్‌పై వచ్చి కూల్‌డ్రింక్స్ కావాలని అడిగారు. ఇంతలో ఆమె మెడలోని బంగారు 12గ్రాముల బంగారు గొలుసును లాక్కుని మోటారుసైకిల్‌పై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఫలాభిషేకం


మల్లాం వీధుల్లో కొల్లాసుర, మల్లాసుర యుద్ధ ఘట్టాలు

చిట్టమూరు, సెప్టెంబర్ 17: మండల పరిధిలోని మల్లాంలో వెలసిన వళ్లీ, దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఫలాభిషేకం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శతస్తంభాల కల్యాణ మండపంలో వళ్లీ, దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామితో పాటు ఉత్సవమూర్తులకు 40 రకాల పండ్లు, తేనె, నెయ్యి, పంచదారతో అభిషేకం చేశారు. అనంతరం నందిసేవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మల్లాసుర, కొల్లాసుర, యుద్ధఘట్టాల సన్నివేశాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సునీల్ రెడ్డి, గ్రామస్తులు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రానివ్వం


జీనుగులవారి వీధిలో పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 17: మున్సిపాలిటీలోని 25వార్డుల్లో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు రానివ్వబోమని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అన్నారు. మంగళవారం స్థానిక సమ్మర్ స్టోరేజీ వద్ద మంచి నీటిని, మోటార్లు, పోలేరమ్మ ఆలయం, జీనుగులవారి వీధిలోని జాతర ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామశక్తి పోలేరమ్మ జాతర కోసం లక్షలాది మంది భక్తులు వస్తారని, ఈ సందర్భంగా మంచి నీటి కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, కమిషనర్ రషీద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నీటి సరఫరాలో అంతరాయం

వెంకటగిరి, సెప్టెంబరు 17: పట్టణంలోని 25వార్డుల్లో ఈనెల 19వ తేదీ నీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ తెలిపారు. బోర్ల మోటర్ల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీల నివారణ పనులు చేపడుతున్నందున నీటిని సరఫరా ఆపేస్తున్నామని తెలిపారు.

నవరాత్రి ఉత్సవాల పనులకు టెండర్లు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 17: స్థానిక ధర్మరాజస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి వివిధ పనులకు టెండర్లను పరిశీలించడం జరిగిందని ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ధర్మరాజస్వామి ఆలయంలో టెండర్ల బాక్స్‌ను తెరిచి టెండర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 2నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఆలయంలో పూలమాలలు, విద్యుద్దీపాలంకరణ తదితర ఏర్పాట్లు చేసేందుకు సీల్డ్‌టెండర్లను పిలవడం జరిగిందన్నారు. తక్కువగా నమోదు చేసిన వారికి టెండర్లు కేటాయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, వాటంబేడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి చెక్కుల అందజేత

గూడూరు, సెప్టెంబరు 17: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి మంగళవారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు పలువురు చెక్కులు అందజేశారు. చెన్నూరు గ్రామానికి చెందిన చేనేత కార్మికులు రూ.50వేల చెక్కు, వెంకటేశ్వర్లు అనే చేనేత కార్మికుడు రూ.20వేలు విలువ చేసే చేనేత చీరలను అందజేశారు. కార్యక్రమంలో మట్టం శ్రావణి, కటికాల శ్రీనివాసులు, మదిర వెంకటేశ్వర్లు, రాజనాల, బాలాజీ, చలపతి, శీనయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్వర్ణాంధ్రభారతి పాఠశాల ఆధ్వర్యంలో రూ.60,420, గుండ్ల గోవిందురాజులు రూ.50వేలు, రైతుబజారు వ్యాపారస్థులు రూ.25వేలు చెక్కులను అందజేశారు.

నగదు ప్రోత్సాహక బహుమతి


నగదు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 17: స్థానిక త్యాగరాజవీధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో మంగళవారం బలిజ మహిళాసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఓ విద్యార్థినికి నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మి మాట్లాడుతూ పట్టణానికి చెందిన సుప్రజ చదువులో రాణిస్తుండడంతో ప్రోత్సహించేందుకు తమ సంఘం తరుపున రూ.5వేలు అందజేశామన్నారు. కార్యక్రమంలో పద్మావతి, సువర్ణలక్ష్మి, ఉషా, సాయిజోత్స్న, శ్రావణి, రాధిక, రాధా పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

దొరవారిసత్రం, సెప్టెంబరు 17: దొరవారిసత్రంలోని ఏకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవజీవన్ ఆర్గనైజేషన్, సీసీసీయూ ప్రాజెక్టు సిబ్బంది విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నరసింహరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెరియార్ జయంతి

కోట, సెప్టెంబరు 17: కోట పట్టణంలో మంగళవారం ద్రవిడ హక్కుల పోరాట యోధుడు పెరియార్ రామస్వామి జయంతిని మంగళవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి చోడవరం సుధాకర్, గూడూరు ఇన్‌చార్జి మీజూరు సుబ్రహ్మణ్యం, మురళి, మల్లికార్జున్, రవి, కర్లపూడి పోలయ్య, ఆర్వీ రమణయ్యపాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 17: స్థానిక జానకిరాంపేటలోని గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం హీరాబెన్ మాతాజీగ్లోబల్ ట్రస్ట్ అధ్యక్షుడు కంకణాల పెంచలనాయుడు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు.

95 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యం లారీ వద్ద సీఐ, సీఎస్ డీటీ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 17: నాయుడుపేట మండలంలోని శ్రీనివాసాపురం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 95బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ బాబీ తెలిపారు. మంగళవారం ఉ వాహనాలు తనిఖీ చేస్తుండగా సూళ్లూరుపేట నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్య తెలిపారు.

తారెత్తిస్తున్న ఉల్లి

తగ్గిన దిగుమతులు ● వారం నుంచి ధర పైపైకి


మార్కెట్‌లో విక్రయిస్తున్న ఉల్లిపాయలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 17: కూరల్లో నిత్యావసరమైన ఉల్లి ధర తారెత్తిస్తోంది. సాధారణంగా ఉల్లిపాయల్ని కోస్తుంటే కన్నీళ్లు వస్తుంటాయని, అటువంటిది ఇప్పుడు కొనాలన్నా ధరలు మండిపోయి కన్నీళ్లు వస్తున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వరదల కారణంగా ఉల్లిపాయల ధర పెరుగుతోందని వ్యాపారులు పేర్కొంటున్నారు. కర్ణాటక, పుణే నుంచి అవసరమైనంత రాకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. మహారాష్ట్రంలో కొత్తపంట మార్కెట్‌కు రాకపోవడంతో దీపావళి వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఒకప్పుడు కిలో రూ.15 నుంచి రూ.30 వరకు ధర ఉండే నాణ్యమైన ఉల్లిపాయలు నేడు రూ.60 నుంచి రూ.70కి చేరుకోవడం గమనార్హం.

చవితి ముందు నుంచి ధర పైపైకి

మహారాష్ట్రలోనే కిలో నాణ్యమైన ఉల్లిపాయలు రూ.45 పలుకుతుందని, అక్కడ నుంచి రవాణా ఇతర ఖర్చులు కలిపి కిలోకు రూ.10 అవుతుందని, దీంతో స్థానికంగా మార్కెట్‌లో రూ.60 విక్రయిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌లో నాణ్యతను అనుసరించి రూ.40, రూ.50, రూ.60 వరకు ధర పలుకుతోంది. గతంలో పోలిస్తే హోల్‌సేల్ మార్కెట్‌కు వచ్చే సరుకు సగానికి పడిపోయింది. గతంలో ఉల్లిగడ్డల లారీలు నాలుగైదు వచ్చేవి. ప్రస్తుతం మూడు రోజులకొకసారి రెండు లారీలు కూడా రావడం లేదని వ్యాపార వర్గాలు వెల్లడించాయి. మన రాష్ట్రంలో ఉల్లి పంట రావడంలో జాప్యం జరగడం ధర పెరిగేందుకు మరో కారణం.

మహారాష్ట్ర మార్కెట్టే ఆధారం

మహారాష్ట్రలోని షోలాపూర్, నాసిక్ ఉల్లిగడ్డలకు పెట్టింది పేరు. అధికశాతం సరుకు అక్కడ నుంచి మన రాష్ట్రానికి దిగుమతి అవుతుంది. తర్వాత మధ్య ప్రదేశ్, కర్ణాటక నుంచి ఉల్లిపాయలు మోస్తరుగా వస్తుంటాయి. ప్రస్తుతం అక్కడ కూడా విస్తారంగా వర్షాలు కురిసి వరదలు ముంచెత్తాయి. మరోవైపు మన రాష్ట్రంలోని కర్నూలులో ఉల్లి పంట జాప్యమైంది. ఆగస్టు పంట రాలేదు. గుంటూరు, ప్రకాశం జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో ఉల్లిగడ్డల పంట పండిస్తారు. అది ఫిబ్రవరి నుంచి వస్తుంది. దీంతో ఏడాదిలో తొమ్మిది నెలల వరకు మహారాష్ట్ర నుంచి వచ్చే సరకు పైనే ఆధారపడాల్సి ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. కేవలం వర్షాలు, వరదలు, వల్లే ధరలు పెరిగిందని, రాబోయే రోజుల్లో తగ్గే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు వెల్లడించాయి.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కండి


కడపత్రలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 17: పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు అవ్వాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మండల పరిధిలోని కడపత్రలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 16మంది లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొంజి వెంకటేశ్వర్లు, పాకం వెంకటసుబ్బయ్య, సుధాకర్ రెడ్డి, తిరుపాల్, ఎల్లయ్య, ఎంపీడీవో ప్రమీలారాణి, గృహ నిర్మాణశాఖ ఈఈ మోహన్ రావు, డీఈ ధశయ్య, ఏఈ మహమ్మద్ అక్రం, ఏపీవో నాగరాజు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో మునిరత్నం ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పరిశుభ్రత ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు పుష్ప, ఉపాధ్యాయుడు మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

తడ: మండల కేంద్రంలో ఎంపీడీవో విజయకుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో మానవహారం చేశారు. పలు శాఖల అధికారులు, టీడీపీ నాయకులు రవి, కోఆప్షన్ సభ్యుడు హుస్సేన్ పాల్గొన్నారు.

దొరవారిసత్రం: దొరవారిసత్రంలో ఏకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి అధికారులు ర్యాలీ చేపట్టారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు మావిళ్ళపాడు మోడల్ స్కూల్ విద్యార్థులతో కలసి జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుమలత, ఎన్‌హెచ్ఏఐ పీడీ ఎంకే చౌదరి, డీఎం సుదర్శన్, టోల్‌ప్లాజా సీవోఎం హరిపాండురంగస్వామి, మేనేజర్ నాగరాజ్ పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. దొడ్డవారిమిట్ట గ్రామంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కంద మూడి శివకుమార్ ఆధ్వర్యంలో చెత్త చెదారాలను తొలిగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శాంతి, వెలుగు సిబ్బంది చంద్రసేన, టీడీపీ నాయకులు ఆరూరు వెంకటేశ్వర్లు, బడతోటి మురళి తదితరులు పాల్గొన్నారు.

కోట: డీఎల్‌పీవో వెంకటరమణ, ఎంపీడీవో భవానీ, సీడీపీవో మునికుమారి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. బజారుసెంటర్‌లోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మానవహారం పాటించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


పరిసరాలను శుభ్రం చేస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 17: పట్టణ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐసీఎస్‌రోడ్డు, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు చీపురలను చేతపట్టుకుని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు చెత్తాచెదారాలను రోడ్లపైన వేయకుండా కుండీలలో, చెత్త సేకరణకు వచ్చే సిబ్బందికి అందజేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛతను సాధించగలుగుతామని, ప్రతి ఒక్కరూ ఇందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, అరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, బత్తిన ప్రణీత్, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో వినీల్ కుమార్, ఉద్యోగులు చీపుర్లు చేతపట్టి బస్టాండు పరిసరాలను శుభ్రపరిచారు. మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు దట్టం అంజలి, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: మండల పరిషత్ కార్యాలయం నుంచి అశోక్ పిల్లర్ వరకు ఎంపీడీవో మనోహర్‌గౌడ్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగబాబు, ఏపీవో విజయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్‌బద్రి, అంబేద్కర్ గురుకులప్రధానోపాధ్యాయులు నరసింహచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీతో పాటు మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని అన్ని పంచాయతీల్లో విజయవంతం చేయాలని కోరారు. ఇందులో భాగంగా అక్టోబరు 2వ తేదీ వరకు రోజువారీ కార్యక్రమాలు చేపట్టేందుకు షెడ్యూలు ప్రకటించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి శైలజ, కార్యదర్శులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

20న బంగారుపాళ్యానికి మంత్రి లోకేష్ రాక

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 17: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ 20వ తేదీన బంగారుపాళ్యం రానున్నారు. బంగారుపాళ్యం ఆస్పత్రిలో ఏర్పాటు చేయించిన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. తొలుత 19న లోకేష్ పర్యటన ఉంటుందని ప్రచారం జరిగింది. చివరకు 20వ తేదీకి పర్యటన ఖరారైంది.

మట్టి ట్రాక్టర్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 17: మండలంలోని పుదూరు పంచాయతీ అత్తలపాళెం చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు వీఆర్వో మనోజ్ తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం


కలెక్టర్ వెంకటేశ్వర్‌కు చెక్కు అందజేస్తున్న జితేష్

వాకాడు, సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధితుల సహాయార్థం వాకాడు మండలం పంబలి ప్రాంతంలో ఉన్న కె.ఆంజనేయ మెరైన్ హేచరీ యజమాని జితేష్ రూ.లక్ష, కోట మండలం మహాలక్ష్మి హ్యాచరీస్ యజమాని సాగర్ రెడ్డి రూ.లక్ష, చెక్కులను మంగళవారం తిరుపతిలోని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి అందజేశారు.

కరిమాణిక్యస్వామి ఆలయంలో శ్రీవారి లడ్డూల విక్రయం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 17: నాయుడుపేట తుమ్మూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్య స్వామి ఆలయంలో భక్తులకు తిరుమల శ్రీవారి లడ్డూలు విక్రయిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ హరి తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

దొరవారిసత్రం, సెప్టెంబరు 17: మండలంలోని గొల్లపాళెం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో కృష్ణయ్య మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

పాఠశాలకు వాటర్ క్యాన్ల పంపిణీ

చిట్టమూరు, సెప్టెంబర్ 17: మండల పరిధిలోని అరవపాళెం ఉన్నత పాఠశాలకు ఆరు కూలింగ్ వాటర్ క్యాన్‌లను టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు చెంచు రామయ్య ఆచారి హెచ్‌ఎం ప్రభావతికి అందజేశారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

బాలాయపల్లి, సెప్టెంబరు 17: ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని మండలంలోని సిద్దాగుంట గ్రామస్తులు తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎక్కువ మంది మహిళలు పాల ఉత్పత్తి మీద ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఆక్రమణలతో పశువులు మేతకు భూములు లేకుండాపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

తడ, సెప్టెంబరు 17: మండలంలోని బోడిలింగాలపాడు వద్ద ఉన్న కాళీకాదేవి ఆలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి నిర్వహించారు. అన్నదానం చేశారు. విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు పరంధామయ్య ఆచారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, బాబు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. స్థానిక పీర్లచావడం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాస్కర్ ఆచారి, మాధవయ్య ఆచారి, వేణుగోపాల్, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి చర్యలు: పాశిం

చిల్లకూరు, సెప్టెంబరు 17: మండలంలో ధ్వంసమైన రోడ్లను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం పారిచెర్లవారిపాళెం నుంచి ఉడతావారిపాళెం వరకు రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో భారీ వాహనాలతో సిలికా రవాణ చేయడం వల్ల రోడ్లు ధ్వంసమయ్యాయన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రూ.74 లక్షలతో పారిచెర్లవారిపాళెం నుంచి ఉడతావారిపాళెం వరకు 8 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులు పనులకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ రామాంజనేయులు, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, లీలావతి, జడ్పీటీసీ శీనయ్య, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, కుమార్‌యాదవ్, మునిశేఖర్‌గౌడ్, జానకిరామిరెడ్డి, నాగరాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ డీలర్ల లైసెన్స్ కొనసాగించాలి


మైనింగ్ ఏడీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎండీఎల్ సభ్యులు

చిల్లకూరు, సెప్టెంబరు 17: మైనింగ్ డీలర్ల లైసెన్స్(ఎండీఎల్)ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఏడీ మైనింగ్ కార్యాలయం వద్ద మంగళవారం ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎండీఎల్ సభ్యులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నుంచి సిలికా, క్వార్ట్ మైనింగ్ నిర్వహిస్తున్న ఎండీఎల్‌ను నిలుపుదల చేశారన్నారు. అయితే ఇప్పటి వరకు కొనసాగించలేదన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి అనుమతులను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎండీఎల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 17: ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడపజోన్ ఈడీ చెంగల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డీజల్ మెకానిక్ 97, మోటార్ మెకానిక్ 6, ఎలక్ట్రీషియన్ 25, వెల్డర్ 4, పెయింటర్ 2, ఫిట్టర్ 9, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ఒకటి పోస్టులు ఖాళీలున్నాయి. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని ఎస్పీఎస్ఆర్‌లో ఐటీఐలో ఉత్తీర్ణులైనవారు మాత్రమే అర్హులన్నారు. అక్టోబరు 3వతేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 9154291408 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

పెరుమాళ్లపల్లిలో పోషకాహార వారోత్సవాలు

పెళ్లకూరు, సెప్టెంబరు 17: మండలంలోని అనకవోలు పంచాయతీ పెరుమాళ్లపల్లిలో మంగళవారం పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీల్లో అందించే పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రవీణ, సింధూజ, గీతాంజిలి, మంగమ్మ, అంకమ్మ తదితరులు ఉన్నారు.

రావిపాడులో తాగునీటి సమస్య

ఓజిలి, సెప్టెంబరు 17: ఓజిలి మండలం రావిపాడు గ్రామస్తులు 20 రోజులుగా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోటారుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో సమస్య నెలకొందని గ్రామస్తులు అంటున్నారు. సచివాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో రజనీకాంత్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన మోటారుకు వెంటనే మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

కోట, సెప్టెంబరు 17: ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలంటూ స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట వజ్జావారిపాళెం గ్రామస్తులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిట్టేడు పంచాయతీ వజ్జావారిపాళెం సర్వే నెంబరు 521-2, 522లో 140 ఎకరాల అడవి పొరంబోకు భూమిని స్థానికంగా ఉన్న నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 90 కుటుంబాలు సాగు చేసుకొంటున్నాయని తెలిపారు. అయితే కొంతమంది స్థానికేతరులు దొంగ పట్టాలను సృష్టించి ప్రభుత్వ భూమిని కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ భూములను భూమిలేని నిరుపేదలకు పంచిపెట్టాలని కోరుతూ తహసీల్దారు జయజయ రావుకు వినతిపత్రం అందజేశారు.


తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వజ్జావారిపాళెం గ్రామస్తులు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 17: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు అన్నారు. మంగళవారం స్థానిక త్యాగరాజవీధిలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోవడంతో పేదలు అవస్థలు పడుతున్నారన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువద్దామన్నారు. కార్యక్రమంలో పరిమల వెంకటేశ్వరరావు, వేమయ్య, రత్నం, సతీష్‌బాబు, శ్రీనివాసులు, రాధయ్య, దామోదరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: కాంగ్రెస్ పార్టీని బలోపేతమే చేయడమే తమ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ బలపడిందనడానికి మూడు నెలల క్రితం జరిగిన ఎన్నికలే నిదర్శనమన్నారు. బీజేపీ రెండు పర్యాయాలు అధికారంలో ఉండీ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజల సమస్యల పోరాటం చేస్తూ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బెద్దపూడి రాజారెడ్డి, మావుడూరు వెంకటా చలపతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

బాలాయపల్లి, సెప్టెంబరు 17: మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ఎంపీడీవో వినీల్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అలిమిలి, పల్లిపాడు గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో మృత్యుంజయరావు, ఈవోపీఆర్డీ మోహన్‌రాజు, ఈసీ కరుణాకర్ రెడ్డి, టీఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జనసేన సంబరాలు

వెంకటగిరి, సెప్టెంబరు 17: రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించినందుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గిన్నీస్ బుక్ రికార్డులో నమోదయ్యారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో నాయకులు తోట కృష్ణయ్య, తిరుపాల్, రేవతి, కస్తూరి, రాజేష్, కరెంట్ విజయ, నాగరత్నమ్మ, రవీంద్ర, పశుపులేటి మురళి పాల్గొఉన్నారు.

గణనాథుల గ్రామోత్సవం

కోట, సెప్టెంబరు 17: మండల పరిధిలోని విద్యానగర్, ప్రకాశంకాలనీలో మంగళవారం గణనాథుల గ్రామోత్సవం జరిగింది. భారీ వినాయక విగ్రహాలతో యువత కేరింతలు కొడుతూ గ్రామోత్సవాలు నిర్వహించారు. మేళతాళాల నడుమ విగ్రహాలను ఊరేగించి మండల పరిధిలోని శ్రీనివాసనత్రం సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు.



చెరువు మట్టి అక్రమ తరలింపు



నాగలాపురం, సెప్టెంబరు 17: మండలం లోని టీపీ పాళ్యం చెరువులోని ఎర్రమట్టిని నాగలాపు రానికి చెందిన ఓ అధికార పార్టీ నేత అక్రమంగా తరలించారు. చెరువులో ఎక్స్‌కవేటర్లతో మట్టిని లోడి సుమారు 5 ట్రాక్టర్ల ద్వారా తన సొంత స్థలానికి తరలించారు. దీనిపై గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నట్టు వీఆర్వో తెలిపారు. ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు మట్టి తరలింపును ఆపేశారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 17: పట్టణంలోని రాయలసీమ జూనియర్ కళాశాలలో మంగళవారం తిరుపతి ఎస్పీ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల నిర్మూలనపై 1వ పట్టణ సీఐ గోపి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యసనాలతో కుటుంబాలు వీధిన పడుతాయన్నారు. మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం మహిళలపై జరిగే నేరాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయభారత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి విరాళం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 17: విజయవాడలో ఇటీవల వరదలకు నష్టపోయిన వారి సహాయార్థం మంగళవారం ముఖ్య మంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసి రూ.1.50 లక్షలను టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్, తిరుపతి పార్లమెంటు టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సుబ్బయ్య అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ... ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ విరాళం అందజేశామన్నారు.

రేపటినుంచి మండలస్థాయి స్కూల్ గేమ్స్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 17: పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 19వ తేదీ గురువారం నుంచి మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు జరగనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అండర్-14, అండర్-17 బాల, బాలికల వాలీబాల్, కబడ్డీ, యోగా, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్ పోటీలు ఉంటాయని తెలిపారు. 19న అండర్ 14, అండర్ 17 బాలుర కబడ్డీ, బాల, బాలికలకు చెస్, యోగా, బ్యాడ్మింటన్, 20న అండర్4, అండర్17 బాలికల వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, 21న అన్ని విభాగాలకు కలిపి అథ్లెటిక్స్ జరుగుతాయన్నారు. అండర్ -14కు హాజరయ్యే విద్యార్థులు 2011 జనవరి 1 తరువాత, అండర్-17కు హాజరయ్యే విద్యార్థులు 2008 జనవరి 1 తరువాత జన్మించినవారై ఉండాలన్నారు. 19న ఉదయం 9గంటలకు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హాజరు కావాలని తెలిపారు.

ఆదిమూలం కోలుకోవాలని బస్సు యాత్ర

నారాయణవనం, సెప్టెంబర్ 17: ఎమ్మెల్యే ఆదిమూలం ఆరోగ్యం కుదుటపడి, ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేయాలని నారాయణవనం మండల నాయకులు తిరువణ్ణామలైకు మంగళవారం బస్సు యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ కుట్రలో భాగంగానే ఎమ్మెల్యేను ఇబ్బంది పెట్టారని, ఇదంతా హనీట్రాప్ అని భాస్కరన్, మాణిక్యం రెడ్డి, గోవిందస్వామి తదితరులు అన్నారు.

పుత్తూరు వార్తలు

రేషన్... పరేషాన్!

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 17: మండలంలో నిరుపేదలకు అందించాల్సిన రేషన్ పంపిణీలో జాప్యం నెలకొంది. కొందరు ఎండీయూ ఆపరేటర్లు రేషన్ పంపిణీకి మొరాయిస్తున్నారు. రేషన్ పంపిణీ సజావుగా నిర్వహించాల్సిన సీఎస్ డీటీ పత్తాలేకుండా పోవడంతో సమస్య జటిలంగా మారింది. తహసీల్దార్ నేరుగా ఎంయూడీ ఆపరేటర్లతో మాట్లాడుతున్నప్పటికీ వారి నుంచి స్పందన లేకుంది. దీంతో వీఆర్వోలతో రేషన్ పంపిణీకి సిద్ధమయ్యారు. పుత్తూరు మండల పరిధిలో 20,045 రేషన్ కార్డుదారులు ఉన్నారు. కాగా, రేషన్ పంపిణీకి 42 మంది డీలర్లు ఉన్నారు. ప్రస్తుతం ఉన్న రేషన్ డీలర్లను తొలగించనున్నారన్న క్రమంలో ఇప్పటికే కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పంపిణీలో మొరాయింపునకు కారణంగా రెవెన్యూ సిబ్బంది చెప్పుకొస్తున్నారు. ఏది ఏమైనా కార్డుదారులకు రేషన్ సకాలంలో అందజేసేందుకు తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు.

ఘనంగా ప్రారంభమైన స్వచ్ఛతా హీ సేవ



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 17: పుత్తూరు పురపాలక పరిధిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ హరి, కమిషనర్ కె.ఎల్.ఎన్. రెడ్డి ప్రారంభించారు. మంగళవారం పురపాలక కార్యాలయం ఆవరణలో మానవహారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డీఈ చంద్రశేఖర్ రెడ్డి, ఏఈలు హేమశేఖర్, కార్తికేయ, టీపీవో మూర్తి, శానిటరీ ఇన్‌చార్జ్ ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 17: మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు విద్యా సామగ్రిని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. చిన్నరాజు కుప్పం, నెత్తం పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పిస్తానన్నారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి రవినాయుడు, బాలాజీ నాయుడు, ధనపాల్, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

పుత్తూరు, సెప్టెంబరు 17: అపరిష్కృత సమస్యలను పరిష్కరిస్తూ ఆర్థికంగా దేశాన్ని అభివృద్ధి పథంలో ప్రధాని మోదీ నడిపిస్తున్నారని పుత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ అన్నారు. ప్రధాని జన్మదినం సందర్భంగా మంగళవారం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గ కన్వీనర్ హరిబాబు, బాబు, మధు, అరుణ, మునస్వామి, గణేష్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో తడుకు పశు వైద్యశాల
అవస్థల్లో పాడిరైతులు



పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 17: దాదాపు 15 గ్రామాలకు పాడి రైతుల పశువులకు వైద్య సేవలందించే తడుకు పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకోవడంతో పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. ఎగువగూళూరు, దిగువ గూళూరు, చంద్రప్పనాయుడు, తిమ్మరాజు కండ్రిగ, వేణుగోపాలపురం, వీఎస్ఎస్ పురం, శిరుగురాజపాలెం, పొట్టిగుట్టలు తదితర గ్రామాల పాడి రైతులు పశు వైద్య సేవలు పొందేవారు. అత్యవసర పరిస్థితిలో పశువులకు వైద్యసేవలు పొందడానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుత్తూరు పశు వైద్యశాలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి. ఇక వైద్యశాల శిథిలావస్థలకు చేరుకోవడం మందులు కూడా నిల్వ ఉంచడం లేదు. దీంతో ప్రైవేటు మందుల దుకాణాల్లో అధిక ధరలకు కొనాల్సి వస్తోందని పాడిరైతులు వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులకు సమస్య విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముగిసిన పవిత్రోత్సవాలు



యాగశాల పూజలు - నందీశ్వరుడికి పవిత్రమాల సమర్పిస్తున్న అర్చకుడు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 17: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు మంగళవారం మూలవిరాట్లకు పవిత్ర మాలాధారణతో.. విశేష పూజలతో ముగిశాయి. యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం యాగశాల నుంచి పవిత్ర మాలలు, పూజాద్రవ్యాలను ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారుల సారథ్యంలో ఊరేగింపుగా తీసుకెళ్లి మొదట రంగుల గోపురం వద్ద ఉన్న వినాయక స్వామికి పవిత్రమాల సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న పరివార దేవతలందరికీ పవిత్రమాలలు అలంకరింపజేశారు. అదే విధంగా ముక్కంటీశుడికి, జ్ఞానప్రసూనాంబ మూల విరాట్లకు పవిత్రమాలల సమర్పణ వేదమంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు.



పవిత్రమాలల సమర్పణలో అర్చకులు

యాగశాలలో శాంతిహోమం, చండికేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. మాలాధారణ జరిపి పవిత్రోత్సవాలను ముగించారు. ఈ సందర్భంగా ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి మాట్లాడతూ... ఆలయ పవిత్రోత్సవాలను నిష్టతో చేస్తారన్నారు. నిత్యపూజల్లో దోషాలుంటే ఈ పూజలతో తొలగిపోతాయన్నారు.

కళ తప్పిన స్వర్ణమ్మ

పరిశ్రమల వ్యర్థాలతో కలుషితమవుతున్న నదీ జలాలు



కొత్తవీరాపురం వద్ద స్వర్ణముఖి నదిలో కలిసిన వ్యర్థపు నీరు

ఏర్పేడు, సెప్టెంబరు 17: మండలంలో చెన్నంపల్లి వద్ద ప్రారంభమయ్యే స్వర్ణముఖి మునలిపేడు వరకు సుమారు 18 గ్రామాల మీదుగా ప్రవహించి శ్రీకాళహస్తి పట్టణంలో కలుస్తుంది. వేసవిలో కూడా నదిలో నీరుండడంతో పశువుల దాహార్తి తీరేది. అయితే రేణిగుంట మండలంలో ఉన్న పరిశ్రమల వ్యర్థ జలాలు నదిలో కలిసి కలుషితమవుండడంతో గ్రామీణులు ఇబ్బంది పడుతున్నారు. నది ప్రాంతానికి దగ్గరలో ఉన్న గ్రామాల రైతులు ఒడ్డున బోర్లు వేసుకుని పంటలు పండించుకుంటున్నారు. కొంతమంది నది చుట్టుపక్కల పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అలాగేగిరిజనులు నదిలో చేపలు పట్టుకుని విక్రయిస్తున్నారు. రేణిగుంట మండలంలో ఉన్న కొన్ని పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థపు నీరు చెన్నంపల్లి వద్ద స్వర్ణముఖి నదిలో కలుస్తుండడంతో నీరు కలుషితమవుతోంది. చెన్నంపల్లి, మునగలపాళెం తదితర గ్రామాల్లో బోర్లలో నీరు కూడా రంగుమారిందని స్థానికులు చెబుతున్నారు. నీరు కలుషితమవడంతో గిరిజనులు పట్టుకొస్తున్న చేపలను కూడా ఎవరూ కొను గోలు చేయడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి నదిలో పరిశ్రమల వ్యర్థ జలాలు కలవకుండా చర్యలు తీసుకోవాలని రైతులు, గిరిజనులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 17: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఆర్టీసీ కడప జోన్ ఈడీ చెంగల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో మంగళవారం స్వచ్ఛతే సేవ పక్షోత్సవాల సందర్భంగా కార్మికులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిపో ఆవరణ, గ్యారేజీ, బస్సులను ఎప్పటికపుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అదే విధంగా తమ ఇళ్ల పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని సరస్వతిబాయి పురపాలకసంఘ పాఠశాలలో మంగళవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని పురపాలకసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

కేవీబీపురం: మండలంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఎంపీ డీవో రామచంద్రయ్య ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంటు తెలుగురైతు అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, ఎంఈవో రవికుమార్, కార్యదర్శి గోవిందస్వామి, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట, పల్లం, ఎండీపుత్తూరు తదితర పాఠశాలల్లో స్వచ్ఛతా హీ హి సేవా కార్యక్రమం నిర్వహించారు. అందులోభాగంగా ముందుగా పాఠశాల విద్యార్థులచే పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు.



కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీసీ అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని అంటురోగాలు ప్రబలకుండా చూసుకోవాలని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు తెలిపారు. మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈవోపీఆర్డీ రాజశేఖర్, కార్యదర్శి ఇందిరమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. 14 పంచాయతీల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. ఈవోపీఆర్డీ వెంకటరత్నమ్మ, సర్పంచ్ నాగేశం తదితరులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి ఒకరి ఆత్మహత్య

కేవీబీపురం, సెప్టెంబరు 17: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ఓ.రాంబట్టు(40) విషగుళికలు తిని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పుల పాలవడంతో పాటు తాగుడుకు బానిసయ్యాడన్నారు. దీంతో విష గుళికలు తిని అపస్మారక స్థితికి చేరుకోగా రుయాకు తరలించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

వ్యాన్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

● యువకుడి మృతి

నాగలాపురం, సెప్టెంబరు 17: ఎదురుగా వస్తున్న లగేజీ వాహనాన్ని వేగంగా బైక్ ఢీకొన్న ఘటనలో యువకుడు ప్రాణాలను కోల్పోయాడు. కేవీబీపురం మండలం మారప్పరెడ్డి గ్రామానికి చెందిన కుమార్ బాబు(19) కొంతకాలంగా నాగలాపురం మండలంలోని చిన్నా పట్టులో ఉన్న పిన్నమ్మ ఇంట్లో ఉంటున్నాడు. మంగళవారం సొంత పనుల నిమిత్తం ఊత్తుకోటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో అరటికాయ లోడ్‌తో ఎదురుగా వస్తున్న లగేజీ వాహనాన్ని వేగంగా ఢీకొన్నాడు. గమనించిన స్థానికులు తిరుపతి రుయాకి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఘనంగా నులిపురుగుల నివారణ దినోత్సవం

శ్రీకాళహస్తి/ బుచ్చినాయుడు కండ్రిగ/ ఏర్పేడు , సెప్టెంబరు 17: తొట్టంబేడులోని సీఆర్‌రెడ్డి కళాశాలలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ యశోద, ఆశా వర్కర్ మంజులమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. భాస్కరపేట పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు. బుచ్చినాయుడుకండ్రిగ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దివాకర్ నులిపురుగల మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. ఏర్పేడు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యసిబ్బంది నులిపురుగుల నివారణకు మందులను పంపిణీ చేశారు. పాపానాయుడుపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎంపీడీవో గిడ్డయ్య నులిపురుగుల మాత్రలను వేశారు.

ఘనంగా ప్రధానమంత్రి జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి/ రేణిగుంట, సెప్టెంబరు 17: శ్రీకాళహస్తి పట్టణంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పాతబస్టాండు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ నేతృత్వంలో అన్నదానం నిర్వహించారు. జి.రమేష్‌బాబు, ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. రేణిగుంట ఆర్టీసీ బస్టాండులో బీజేపి మండల అధ్యక్షురాలు తేజవతి నేతృత్వంలో స్వీట్లు పంపిణీ చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి, మధుకర్, జితేందర్‌రెడ్డి, మునస్వామిరెడ్డి, రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజులుగా ఆగిన హెచ్‌పీ సిలిండర్ల సరఫరా

రేణిగుంట, సెప్టెంబరు 17: పట్టణంలో నాలుగు రోజులుగా హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ సరఫరా ఆగిపోయింది. బుక్ చేసుకున్నా సిలిండర్ ఇంటికి సరఫరా కాలేదని హెచ్‌పీ కార్యాలయానికి చేరుకుని సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై హెచ్‌పీగ్యాస్ సిలిండర్ గోదాము యజమాని అజయ్‌ప్రతాప్‌ను వివరణ కోరగా దొంగ అడ్రస్సులతో సిలిండర్ బుక్ చేసుకుని వ్యాపారం చేసేవారిని కట్టడి చేయడానికి కేంద్రప్రభుత్వం కొత్త నిబంధన ప్రవేశపెట్టిందన్నారు. వినియోగదారునికి ఓటీపీ చెప్పిన తరువాతే సిలిండర్ సరఫరా చేయాల్సి వస్తోందన్నారు. దీనికి తోడు నాలుగు రోజులుగా డెలివరీ బాయ్స్ రావడం లేదని తెలిపారు.

ఆలిండియా మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీకి స్వాగతం

రేణిగుంట, సెప్టెంబరు 17: ఆలిండియా మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ శంకర్‌రావుకు రేణిగుంట విమానాశ్రయంలో సీఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఘనస్వాగతం పలికారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు విజయకుమార్, సదాశివరెడ్డి, మునిరాయల్, మునిరామయ్య తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు వెళ్లారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిత



సత్యవేడు, సెప్టెంబరు 17: విద్యార్థి దశలో ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో మెలిగి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలోని బాబు జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను కరస్పాండెంట్ పరంధామ్ ఆధ్వర్యంలో వీఎంకే కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తుకు ఇంటర్మీడియట్ కీలకమన్నారు. ఎంఈవో రవి, ఎంఈవో2 ఉష, టీడీపీ నాయకుడు షణ్ముగం, వైసీపీ నాయకుడు రాబర్ట్, అధ్యాపకులు వేలాయుధం, భాస్కర్, పళణి, ప్రసన్నకుమార్, ఐలు, ఈశ్వర్, సూర్య, అపర్ణ, భానుప్రియ, దీప, ప్రియాంక, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

నంది వాహనంపై పరాశరేశ్వరస్వామి విహారం


నారాయణవనం, సెప్టెంబర్ 17: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ ఆలయమైన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా మూలవర్లకు పవిత్రాలు సమర్పించారు. మంగళవారం ఉదయం పట్టు పవిత్రాలను ఆలయ అంతరప్రాకరంలో ఊరేగించి యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మూలవర్లకు, ఉత్సవ విగ్రహాలకు, పరివార దేవతలకు పవిత్రాలను సమర్పించారు. అనంతరం సాయంత్రం నారాయణవనం వీధుల్లో నంది వాహనంపై చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి విహరించగా భక్తులు దర్శించుకుని తన్మయత్వం చెందారు. డిప్యూటీ ఈవో నాగరత్నం, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు ఉత్సవాలను పర్యవేక్షించారు.

ఇసుక లారీల యజమానులపై కేసు

ఏర్పేడు, సెప్టెంబరు 17: మండలంలోని వికృతమాల వద్ద రెండు రోజుల క్రితం ఐదు లారీల్లో ఇసుకను తరలించడానికి అక్రమార్కులు ప్రయత్నించగా టీడీపీ నాయకుల సమాచారంలో పోలీసులు సీజ్ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఏర్పేడు సీఐ జయచంద్ర విచారణ జరిపారు. నెల్లూరు జిల్లా రాపూరు మండలానికి చెందిన లారీ యజమానులు శ్రీనివాసులు, సుందర రామి రెడ్డి, డ్రైవర్లు హరికృష్ణ, షేక్ మునాఫ్, అంకయ్య, ఏడుకొండలుపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. పారిపోయిన ఎక్స్‌కవేటర్ డ్రైవర్ బాలాజీ సహా నిందితుల కోసం గాలిస్తున్నట్టు చెప్పారు.

ఐదోసారీ...

తూతూమంత్రంగా నిధుల గోల్‌మాల్ విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 17: మండలంలోని ఇందిరా నగర్ పంచాయతీలో సుమారు రూ.70లక్షల నిధుల గోల్‌మాల్‌పై సీసీఆర్ సభ్యురాలు ఏ.ఆషా ఫిర్యాదు మేరకు సంవత్సరంలో ఐదోసారి మంగళవారం విచారణ చేపట్టారు. అయితే ఈసారి కూడా తూతూమంత్రంగా విచారణ సాగింది. ఎప్పటిలాగే ఫిర్యాదుదారులను ప్రశ్నించారు. 15 రోజుల్లో నివేదికను కలెక్టర్‌కు ఇస్తామని అధికారులు తెలిపారు. రికార్డులను తీసుకెళ్లారు. అధికారులు మాత్రమే మారారని, విచారణ ఒకటేనని ప్రజలు అంటున్నారు. కాగా త్వరలో డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసి గోల్‌మాల్‌ను వివరిస్తామని ఆషా తెలిపారు.

సైన్స్ ప్రయోగాల పట్ల దృష్టి సారించాలి

ఏర్పేడు, సెప్టెంబరు 17: ప్రతి విద్యార్థీ సైన్స్ ప్రయోగాల పట్ల దృష్టి సారించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సీఆర్‌సీ కాంప్లెక్స్ స్టేట్ అబ్జర్వర్ అపర్ణ సూచించారు. హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ ఆగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సౌజన్యంతో మంగళవారం ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు అభ్యాసన కల్పించారు. జీవశాస్త్ర అధ్యాయాలపై ఉపాధ్యాయులు పట్టు సాధించాలన్నారు. ఈ సమావేశంలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో బోధించాలన్నారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, ఎంఈవో ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ కవచధారిణిగా దక్షిణకాళికాదేవి



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 17: మండలంలోని వేడాంలో కొలువై ఉన్న దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాల సమయంలో మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వర్ణ కవచం సహా నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. మధ్యాహ్నం దాతల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిగింది.

కాలభైరవుడికి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 17: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం జరిగింది. కాలభైరవ స్వామి సన్నిధి శుద్ధి చేసి మూలమూర్తికి అభిషేకాలు, ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. కాలభైరవుడి ఉత్సవ మూర్తిని మహాద్వారం నుంచి విజయ స్తూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణగా ఆలయంలో కొలువు తీర్చారు. అలాగేముక్కంటి ఆలయంలోని పదహారు కాళ్ల మండపంలో కొలువై ఉన్న ఆంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు. భక్తులు తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 17: పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. అవ్వా తాతలు మధ్యాహ్నం భోజనం తీసుకువచ్చి తమ మనవలు, మనవరాళ్లకు తినిపించి కాసేపు సరదాగా గడిపారు. వారి చేత ఆటలు ఆడించి, పాటలు పాడించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. డైరెక్టర్ గుడ్లూరు మయూర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేరాలపై కార్మికులకు అవగాహన



సూచనలు ఇస్తున్న సీఐ

శ్రీసిటీ, సెప్టెంబరు 17: శ్రీసిటీలోని వెర్మిరన్ పరిశ్రమ ఆవరణలో మంగళవారం డీఎస్పీ సైడేశ్వరరావు, సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళా భద్రతపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఉద్యోగాలు, లోన్లు, లాటరీల పేరిట వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజులు, లింకులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదాలరులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మహిళా కార్మికులు లైంగిక వేధింపులపై నెం. 100, 112, 1090 లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్, శ్రీసిటీ సెక్యూరిటీ హెడ్ రమేష్ పాల్గొన్నారు.